ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 22 మార్చి 2025



భారీ విమాన రాకపోకలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం వేదికగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారీ విమానాల సంఖ్య పెరగడంతో అందుకు తగ్గట్టుగానే ఆక్యుపెన్సీ నిష్పత్తి కూడా వృద్ధి చెందింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో విస్తరించిన రన్‌వే కారణంగా ప్రస్తుతం భారీ విమానాల రాకపోకలకు మార్గం ఏర్పడింది.

జామ్‌జామ్‌గా జంబో..!

విజయవాడ విమానాశ్రయం నుంచి భారీ విమానాల రాకపోకలు

ఎనిమిది నెలల్లో ఎనిమిది భారీ విమానాలు

రోజూ ఎయిర్‌బస్ 5, బోయింగ్ 3.. పెరిగిన ఆక్యుపెన్సీ

- ఢిల్లీ, ముంబయి ప్రయాణికులకు ఉపయుక్తంగా..
- బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్‌కు బోయింగ్
- విమానాలకు అనుకూలంగా మారిన కొత్త రన్‌వే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి భారీ విమానాలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఎయిర్‌బస్, బోయింగ్ విమానాలు పోటీలు పడుతూ తిరుగుతున్నాయి. గతంలో ఒకటి, రెండు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఎనిమిది భారీ విమానాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 37 నుంచి 50కు విమానాల సంఖ్య పెరిగింది. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు విమాన సర్వీసులు గణనీయంగా పెరిగాయి. ఈ కారణంగా భారీ విమానాల సంఖ్య కూడా పెరిగింది.



విజయవాడ విమానాశ్రయంలో భారీ విమానం

భారీ విమానాలు ఇవే..

విజయవాడ విమానాశ్రయం నుంచి రోజూ 8 భారీ విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో ఐదు ఎయిర్‌బస్, మూడు బోయింగ్ విమానాలు ఉన్నాయి. ఎయిర్‌బస్‌లలో ఏ321, ఏ330, ఏ380 రకాలు ఉంటాయి. ఇవన్నీ విమానాశ్రయంలో ల్యాండ్ కావటానికి అవకాశం ఉంది. ఎయిర్‌బస్ ఏ321లో 150 నుంచి 180 మంది ప్రయాణించవచ్చు. ఏ330లో 250 నుంచి 300 వరకు ప్రయాణించవచ్చు. ఎయిర్‌బస్ ఏ380లో 500 నుంచి 850 మంది ప్రయాణించవచ్చు. వీటిలో ఎయిర్‌బస్ ఏ321 విమానాలు ప్రస్తుతం మన దగ్గర రాకపోకలు సాగిస్తున్నాయి. ఎయిరిండియా సంస్థ ఢిల్లీకి మూడు విమానాలు నడుపుతోంది. ఇండిగో సంస్థ ఆధ్వర్యంలో ముంబయికి రెండు నడుస్తున్నాయి. ఎయిర్‌బస్‌లతో పోల్చుకుంటే పరిమాణం రీత్యా బోయింగ్ విమానాలు పెద్దగా ఉంటాయి. ఈ విమానాల్లో బీ737, బీ777, బీ787 విమానాలు ఉంటాయి. బోయింగ్ 737లో 130 నుంచి 220 మంది ప్రయాణించవచ్చు. బోయింగ్ 777లో 300 నుంచి 400 మంది ప్రయాణించవచ్చు. బోయింగ్ 787లో 240 నుంచి 330 మంది ప్రయాణించవచ్చు. ఈ బోయింగ్ శ్రేణి విమానాలన్నీ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేలా రన్‌వేను సిద్ధం చేశారు. ప్రస్తుతం మన దగ్గర బోయింగ్ 737 విమానాలు నడుస్తున్నాయి. ఈ విమానాలు బెంగళూరుకు 1, హైదరాబాద్‌కు 1, విశాఖపట్నానికి 1 చొప్పున నడుస్తున్నాయి. వీటిని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ నడుపుతోంది.

రన్‌వేను విస్తరించడం వల్లే..

విజయవాడ విమానాశ్రయం భారీ విమానాలు ల్యాండింగ్ కావటానికి వీలుగా రన్‌వే పటిష్టతతో పాటు విస్తరణ పనులు కూడా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. 2017లో అప్పటికి ఉన్న 1,685 మీటర్ల రన్‌వేను భారీ విమానాలు దిగేందుకు వీలుగా అభివృద్ధిపరచటంతో పాటు అదనంగా 600 మీటర్ల మేర రన్‌వేను విస్తరించారు. ఫలితంగా మొత్తం 2,285 మీటర్ల పొడవున రన్‌వే విస్తరించింది. దీనివల్ల ఎయిర్‌బస్-321 అనే పెద్ద విమానాలు ల్యాండింగ్ అయ్యే స్థాయికి విమానాశ్రయం చేరుకుంది. ఆ తర్వాత భూ సేకరణ జరిపి మిగతా 6లో..

మరో షాక్..!

వెస్ట్ బైపాస్ పనుల్లో మళ్లీ వివాదం

- 25 రోజులు విద్యుత్ సరఫరా ఆపాలని రాధా సంస్థకు ఎన్‌హెచ్ లేఖ
- అసలు సంబంధం లేని సంస్థకు లేఖ రాయడంపై విమర్శలు
- ఒప్పందం జరిగింది ల్యాంకోతో.. చెల్లింపులు మాత్రం రాధాకు..
- ఆ సంస్థతో సంబంధం లేదని ల్యాంకో లిక్విడేటర్ లేఖ
- అయినా సదరు సంస్థతోనే ఎన్‌హెచ్ అధికారుల మంతనాలు
- ఫలితంగా రూ.250 కోట్ల వరకు నష్టం జరిగే అవకాశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ల్యాంకో లైన్ తమదని, రాధా సంస్థకు సంబంధం లేదని ఓవైపు ల్యాంకో లిక్విడేటర్ స్పష్టంగా చెబుతుండగా, ఆ వివాదం తేలకుండానే ఎన్‌హెచ్ అధికారులు మరో వివాదానికి తెరలేపారు. ఫలితంగా కేంద్రానికి రూ.250 కోట్ల నష్టం ఏర్పడేలా చేశారు.

జరిగింది ఇదీ..

ల్యాంకో పవర్ ప్లాంట్ ఆస్తులను విక్రయానికి పెట్టిన లిక్విడేటర్.. ఎన్‌హెచ్ విజయవాడ డివిజన్ పీడీకి జనవరి 18న ఓ లేఖ రాశారు. రాధా గ్రూప్ సంస్థకు, ల్యాంకో ట్రాన్స్‌మిషన్ 400 కేవీ లైన్‌కు ఎలాంటి సంబంధం లేదని, దానిని తాము ఎన్‌సీఎం పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు విక్రయించామని, తమకూ ఆ సంస్థకు చెల్లింపుల వివాదం నడుస్తోందని లేఖలో పేర్కొన్నారు. రాధా సంస్థతో ఎన్‌హెచ్ జరిపే ఏ విధమైన ఆర్థిక లావాదేవీలకు, తమకు సంబంధం లేదని, లైన్ మార్పులకు తాము ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదని లేఖలో తెలిపారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన ఎన్‌హెచ్ అధికారులు ఈనెల 11న రాధా గ్రూప్ సంస్థకు లేఖ రాశారు. 25 రోజుల పాటు విద్యుత్ నిలుపుదల చేయటానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఓపక్క మూలనపడిన పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి అన్నమాటే లేదు. ఆ లైన్‌లోకి విద్యుతే రానప్పుడు 25 రోజులు నిలుపుదల మిగతా 6లో..

ఒప్పందం ల్యాంకోతో.. చెల్లింపులు రాధాతో..

ల్యాంకో పవర్ ప్రాజెక్టు పనిచేస్తున్నప్పుడు ఆ సంస్థతో ఎన్‌హెచ్ అధికారులు విద్యుత్ అంతరాయ చార్జీలు (డెమరేజెస్ చార్జీలు) చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పుడు ల్యాంకో సంస్థ మూతపడింది. విద్యుదుత్పత్తే జరగట్లేదు. పైగా ఈ లైన్‌ను ఆక్షన్‌కు పెట్టారు. ఇలాంటప్పుడు ఈ లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఏంటో అర్థంకాని పరిస్థితి. పైగా డబ్బు చెల్లిస్తామని ఒప్పందం చేసుకోవడం, ల్యాంకోలోని ఓ యూనిట్‌ను స్క్రాప్ కింద కొన్న రాధా సంస్థకు చెల్లింపులు చేసేలా లేఖ రాయటంపై అనుమానాలు కలుగుతున్నాయి.

వర్రెగూడెంలో వ్యక్తి హత్య

వివాహేతర సంబంధమే కారణం





సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు (ఇన్‌సెట్‌లో) మృతుడు టోపీ శ్రీను (ఫైల్)

మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని వర్రెగూడేనికి చెందిన వీర్నాల శ్రీను అలియాస్ టోపీ శ్రీను (35) శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. వర్రెగూడెంలో నివాసముంటున్న టోపీ శ్రీను వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన రమణ భార్యతో శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో రెండేళ్లుగా ఆమె శ్రీనుతో సహజీవనం చేస్తోంది. శ్రీను కారణంగా తన భార్య తన నుంచి విడిపోయిందని, కాపురం విచ్ఛిన్నమైందని కోపం పెంచుకున్న రమణ తరచూ అతనితో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో రమణ వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు. తిరిగి రెండు రోజుల క్రితం మచిలీపట్నం వచ్చిన రమణ.. శుక్రవారం రాత్రి వర్రెగూడెంలోని మీ సేవాకేంద్రం వద్ద టోపీ శ్రీను ఒంటరిగా ఉండటాన్ని గమనించాడు. తన బంధువులతో కలిసి అక్కడకు వెళ్లి గొడవ పడ్డాడు. తన వద్ద ఉన్న కత్తితో శ్రీనును విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనాస్థలాన్ని ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ సీహెచ్ రాజా, ఇనుగురుపేట పోలీస్ స్టేషన్ సీఐ పరమేశ్వరరావు పరిశీలించారు. ఈ సంఘటనపై వివరాలు సేకరిస్తున్నామని, హత్యలో రమణతో పాటు ఇంకెవరైనా ఉన్నారా అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామని, పాతకక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని ఇనుగురుపేట పోలీసులు తెలిపారు.

ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం 8లో

- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- కలెక్టర్‌తో కలిసి గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన

గడ్డి మేశారు!

జలవనరుల శాఖలో మాయాజాలం

కాలువలపై పెరిగిన గడ్డి ద్వారా ఆదాయం

కాలువ గట్లపై మొలకెత్తిన గడ్డి మాయమైపోయింది. గడ్డికి సంబంధించిన ఆదాయం లెక్కలు అయోమయంగా తయారయ్యాయి. ఇప్పటికీ ఆ లెక్కలు తేలలేదు. మాయమైన గడ్డిపై రూపొందించిన నివేదిక ఓ టేబుల్ నుంచి మరో టేబుల్ పైకి షటిల్ సర్వీసు చేస్తోంది. బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు దోబూచులాడుతున్నారు. ఇదీ జలవనరుల శాఖలోని గడ్డి కథ. ఇప్పుడు ఈ అంశం ఆ శాఖలో మంటలు పుట్టిస్తోంది.

- రూ.30 లక్షల వరకు స్వాహా చేసిన అధికారులు!
- 2020-24 వరకు కనిపించని లెక్కలు
- ఖాతాల్లో జమ కాని నిధులు
- ఓ ఇంజనీర్ వ్యవహారంపై విమర్శలు
- విచారణ పూర్తయినా నేటికీ చర్యలు శూన్యం
- నివేదికతో ఉన్నతాధికారుల దోబూచులాట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలోని జలవనరుల శాఖ పరిధిలో ఉండే కాలువలు, పంట కాలువలు, మురుగు కాలువలపై మొలకెత్తే గడ్డికి ఏటా వేలం పాటలు నిర్వహిస్తారు. జూలై నుంచి ఆగస్టు మధ్యలో ఈ పాటలు మొదలవుతాయి. ఈ పాట గడువు ఏడాది వరకు ఉంటుంది. ఈ కాల్వ గట్లపై మొలకెత్తే గడ్డిని రైతులు పర్లాంగుల లెక్కన పాడుకుంటారు. ఒక పర్లాంగులో మొలకెత్తే గడ్డికి రూ.100 నుంచి రూ.200 ధరను జలవనరుల శాఖ నిర్ణయిస్తుంది. పాటదారులు ఎక్కువగా వేలంలో పాల్గొన్నప్పుడు ఒక పర్లాంగులో మొలకెత్తే గడ్డి ధర రూ.1000 - రూ.2వేల వరకు పలుకుతుంది. జలవనరుల శాఖలో స్పెషల్, డ్రెయినేజీ, కృష్ణా ఈస్ట్, కృష్ణా సెంటర్ డివిజన్లు ఉన్నాయి. వాటి పరిధిలో ఒక్కో డివిజన్ కింద నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ సబ్ డివిజన్ల పరిధిలో సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో ప్రవహించే పంట కాలువలు, మురుగు కాలువలు సబ్ డివిజన్ల పరిధిలో ఉన్నాయి. 1997లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేస్తూ చట్టం తీసుకొచ్చింది. పంట కాలువలు, మురుగునీటి కాలువలపై మొలకెత్తే గడ్డికి వేలం నిర్వహించి దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని జమ చేయడానికి జలవనరుల శాఖకు ఒక ప్రత్యేక ఖాతా ఉండేలా చర్యలు తీసుకుంది. ఇలా కాలువ గట్లపై మొలకెత్తే గడ్డిని సంబంధిత రైతులు, పాడి రైతుల వేలం ద్వారా దక్కించుకుంటున్నారు. ఈ వేలం పాటల్లో సాగునీటి సంఘాలకు భాగస్వామ్యం ఉంది. ఇలా వచ్చిన ఆదాయంతో గట్లకు గండిపడినప్పుడు మరమ్మతులు చేసుకుంటారు.



ఇంజనీర్లకు అవకాశంగా మారిన 'రద్దు'

వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో సాగునీటి సంఘాలను రద్దు చేసింది. సాగునీటి సంఘాల పాలకవర్గాలకు ఇంకా ఏడాది గడువు ఉండగానే జగన్ రద్దు నిర్ణయాన్ని అమలు చేశారు. దీంతో అధికారాలు మొత్తం సంబంధిత సబ్‌డివిజన్ ఇంజనీర్ల చేతుల్లోకి వెళ్లాయి. అప్పటి నుంచి గట్లపై గడ్డిని కొంతమంది ఇంజనీర్లు 'మేశారు'. గడ్డికి వేలం నిర్వహించి దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇంజనీర్లు, సెక్షన్ అధికారులు తమ సొంత ఖాతాల్లో జమ చేసుకున్నారు. బందరు మిగతా 6లో..

బందరును అభివృద్ధి చేసుకుందాం

- పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించండి
- మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు
- ఘనంగా 'స్వచ్ఛ మచిలీపట్నం'

6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-23 (శనివారం సాయంత్రం)
సహర్ : 04-50 (ఆదివారం ఉదయం)

ఖరీఫ్ సీజన్‌లో ఎంతమేర ధాన్యం కొనాలనే అంశంపై అంచనా లేకుండా అధికారులు తీసుకున్న నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. ఈ సీజన్‌కు సంబంధించి ఈనెల 31 నాటికి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను నిలిపేస్తామని జేసీ గీతాంజలిశర్మ ప్రకటించారు. ఇంకా 20 వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఉన్నాయని, అంతవరకు మాత్రమే కొంటామని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మిగులు ధాన్యాన్ని ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

కొనుగోలు కష్టాలు

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు దాదాపు నిలిపివేత

- రైతుల వద్ద ఇంకా 3.36 లక్షల టన్నులు
- ఏం చేయాలో తెలియక సతమతం
- తక్కువకు కొంటున్న ప్రైవేట్ వ్యాపారులు
- మిగులు కోటాలోనైనా కొనాలని వేడుకోలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరిగింది. 9.79 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 5.50 లక్షల టన్నులు కొంటామని ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన 4.29 లక్షల టన్నులు ఎలా కొనాలనే అంశంపై సరైన నిర్ణయం ప్రకటించలేదు. ఇప్పటివరకు జిల్లాలో 70,718 మంది రైతుల నుంచి 5.83 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మరో 60 వేల టన్నుల ధాన్యాన్ని రైతులు ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులకు విక్రయించారు. ఇంకా జిల్లాలోని రైతుల వద్ద 3.36 లక్షల టన్నుల వరకు ధాన్యం ఉండిపోయింది. ప్రభుత్వం ద్వారా కొనుగోలు ప్రక్రియ దాదాపు నిలిచిపోవడంతో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని స్థానిక మిల్లర్లు లేదా మండపేట, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నిర్ణయించిన ధరకు రైతులు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం మినుములీత పనులు జరుగుతుండటంతో రైతులు కుప్పనూర్పిళ్లు చేస్తున్నారు.

75 కిలోల బస్తా ధర రూ.1,500 నుంచి రూ.1,600

ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో 75 కిలోల బస్తా ధాన్యాన్ని రూ.1,500 నుంచి రూ.1,600కు మాత్రమే కొంటామని స్థానిక మిల్లర్లు, మండపేటకు చెందిన వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం బస్తా ధాన్యం మద్దతు ధరను రూ.1,725, రూ.1,740గా నిర్ణయించింది. రైతులు.. రైతుసేవా కేంద్రాలకు వెళ్లగా, ధాన్యం కొనుగోలుకు సంబంధించి టార్గెట్లు మిగతా 6లో..



బందరు మండలంలో జరుగుతున్న కుప్పనూర్పిళ్లు

రాష్ట్రాభివృద్ధికి రూ.7లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ

» ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల ప్రత్యేక కృషితో రాష్ట్రానికి రూ.7లక్షలకోట్ల పెట్టుబడులు రానున్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి వివిధ రంగాల్లో ప్రముఖులైన నలుగురు సలహాదారులను నియమించటం పట్ల చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సుచిత్ర ఎల్ల, జి.సతీష్ రెడ్డి, కేపీసీ గాంధీ, సోమనాథ్ వంటి నిపుణుల సలహాలు రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నాలుగు రూరల్ నియోజకవర్గాల్లో 100 శానిటరీ వెండింగ్ మెషిన్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలోని యుపీసీ పీహెచ్‌సీలను రూ.12.40కోట్లతో ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. నాలుగు శానిటరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లను నెలకొల్పనున్నట్టు పేర్కొన్నారు. ఢిల్లీకి చంద్రబాబు పలుమార్లు వెళ్లడం వల్లనే విజయవాడకు ఫ్లై ఓవర్, అమరావతి రైల్వేలైన్ వంటివి వచ్చాయన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నుంచి నిడమానూరు వరకు 6.3 కిలోమీటర్ల ఫ్లై ఓవర్‌కు అనుమతి లభించినా.. ఈ మార్గంలో మెట్రోలైన్ రావటం వల్ల జాప్యం జరిగిందన్నారు. పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గంలో రైల్వేగేట్ల వల్ల ప్రజలు ఇబ్బందులు గుర్తించి ఆర్వోబీ, ఆర్యూబీలు కావాలని అడుగుతున్నట్టు తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్‌ను త్వరలో ఆధునీకరిస్తామని, శాటిలైట్ స్టేషన్లుగా గుణదల, రాయనపాడు వున్నా, అదనంగా మరొకటి అడుగుతున్నట్టు తెలిపారు. రాష్ట్రానికి త్వరలో 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయన్నారు.



విజయవాడ రైల్వేస్టేషన్, గూడ్స్ బోగీల్లో సరుకు లోడింగ్

స్థూల ఆదాయంలో విజయవాడ రైల్వే రికార్డు



రైల్వే స్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ సరుకు రవాణాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5,638 కోట్ల రికార్డు ఆదాయంతో అత్యుత్తమ పనితీరును కనబరిచింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 11 రోజులు ఉండగానే ఈ రికార్డు నెలకొల్పింది. సరుకు రవాణాలో రూ.4,098.21కోట్ల ఆదాయం ఆర్జించింది. 2023లో రూ.5,625 కోట్లు, 2024లో రూ.4,062 కోట్లు సాధించింది. ముఖ్యంగా డివిజన్ ఆదాయంలో 72.6 శాతం సరుకు రవాణా ద్వారా, 23.8 శాతం ప్రయాణికుల ద్వారా సమకూరింది. సరుకు రవాణాలో రూ.4,098 కోట్లు, ప్రయాణికుల ద్వారా రూ.1,342 కోట్లు, తనిఖీల ద్వారా రూ.109 కోట్లు, ఇతరత్రా ఆదాయాల ద్వారా రూ.89 కోట్లు సాధించింది. కృష్ణపట్నం ఓడరేవు రూ.2,078 కోట్లు, కాకినాడ పోర్టు రూ.1,110 కోట్లు సాధించాయి. విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్, సీనియర్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబులు మాట్లాడుతూ, ఈ రికార్డు ఆదాయం డివిజన్ సామర్థ్యాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ఇది ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. మరోవైపు కొత్త రైల్వే లైన్లను ప్రారంభించటంతో మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు.



ఎన్టీటీపీఎస్ సందర్శనలో సంగ్రా, ఇతర అధికారులు

ఎన్టీటీపీఎస్‌ను సందర్శించిన డిఫెన్స్ అధికారులు

ఇబ్రహీంపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్‌ను నేషనల్ డిఫెన్స్ అధికారులు, రిటైర్డ్ ఆర్మీ మేజర్ జనరల్ సీపీ సంగ్రా తన బృందంతో కలిసి శుక్రవారం సందర్శించారు. ప్లాంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతలో తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మిలటరీ అధికారులు మంజిత్‌సింగ్, రాజపుత్, మమతా వర్మ, సందీప్‌కుమార్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులు తీసుకున్నాం..

» తిరుపతమ్మ తిరునాళ్లలో అపశ్రుతిపై ఈవో వివరణ

జగ్గయ్యపేటరూరల్ 21 (ఆంధ్రజ్యోతి) : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ తిరునాళ్లలో ఎగ్జిబిషన్ నిర్వహణలో అపశ్రుతిపై ఆలయ అధికారులు వివరణ ఇచ్చారు. శుక్రవారం ఆలయ ఈవో మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లాగానే ఆర్డీవో సమక్షంలో సమీక్ష జరిపిన మేరకు ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇచ్చామని చెప్పారు. దేవదాయ, విద్యుత్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ శాఖలు అనుమతి ఇచ్చాయని, ఫిట్‌నెస్ పరిక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు అందుబాటులోకి రాలేదని చెప్పారు. ఆలస్యం అవుతున్నందున జరిగే ప్రతి పరిణామానికి పాటదారుడిపై బాధ్యత పెట్టి అనుమతి ఇచ్చామని, ఘటనపై ఆలయానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఘటన జరిగిన వెంటనే పాటదారుడైన కాకాని శేషగిరిరావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



సీఐఎస్ఎఫ్ దళాలతో కలిసి సైకిల్ తొక్కుతున్న కలెక్టర్ బాలాజీ

సీఐఎస్ఎఫ్ సేవలు అభినందనీయం

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ : దేశ శాంతిభద్రతలతో పాటు యువతను చైతన్యపరుస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సిఐఎస్ఎఫ్) సేవలు అభినందనీయమని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలు నుంచి సీఐఎస్ఎఫ్ ర్యాలీని కలెక్టర్ బాలాజీ, ఏఎస్పీ సత్యనారాయణలు అభినందించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ దళాలతో కలిసి సైకిల్ తొక్కి స్ఫూర్తినిచ్చారు. సీఐఎస్ఎఫ్ దేశం నలుమూలల అంతర్గత పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నదన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా భద్రతాదళం చైతన్యపరుస్తోందన్నారు. మహోన్నత లక్ష్యంతో ఆరువేల కిలోమీటర్లు సైకిల్ ర్యాలీ చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర్, హృషబ్ దేవాంజన్ తదితరులు పాల్గొన్నారు.

బందరును అభివృద్ధి చేసుకుందాం

» పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించండి

» పి-4కు పారిశ్రామికవేత్తలు స్పందించాలి

» మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బందరు అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. స్వచ్ఛ బందరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగర పరిధిలోని పాత రైల్వేస్టేషన్ నుంచి బందరుకోటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆర్టీసీ



మొక్కనాటుతున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, బండి రామకృష్ణ తదితరులు

ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, బ్రిటీషుకాలం నుంచి ఉన్న మచిలీపట్నం పోర్టు రోడ్డుకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. కాలక్రమేణా చెత్తా చెదారంతో అధ్వానంగా తయారైన ఈ రోడ్డును తిరిగి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మచిలీపట్నం సుందరీకరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. నగరంలో రోడ్లకు ఇరుపక్కలా ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టామని, ఈ పనికి ఎక్కువ శాతం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బందరు అభివృద్ధికి ప్రజలు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పి-4 కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం అభివృద్ధికి, పేదరికం లేని సమాజ నిర్మాణానికి అందరూ ముందుకురావాలన్నారు. విజన్-2047 దృష్టిలో ఉంచుకుని నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముడా పరిధిలో ఉన్న మచిలీపట్నంను సీఆర్డీఏ పరిధిలోకి తీసుకుని వచ్చేందుకు యోచిస్తున్నామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, పచ్చదనం-పరిశుభ్రత సీఎం చంద్రబాబు ఆశయమని, ఇందులో భాగంగా ప్రజలు సహాయ సహకారాలు అందించి నగరాన్ని మోడల్ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, తలారి సోమశేఖర్, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఈత సరదా!

» నీట మునిగి విద్యార్థి మృతి



ఇబ్రహీంపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన బలుసుపాటి కుమార్ (14) కవులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. స్నేహితుడు చావల రేవంత్‌తో కలిసి శుక్రవారం బుడమేరు డైవర్షన్ ఛానెల్ వద్ద ఈతకు దిగాడు. గుంత లోతుగా ఉండటంతో దానిలో మునిగిపోయాడు. స్నేహితుడు కేకలు వేయడంతో స్థానికులు బాలుడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. అప్పటికే చనిపోవడంతో గుంతలో చిక్కుకుపోయిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాలుడి మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుడమేరు డైవర్షన్ ఛానెల్‌లో ఇటీవల గండి పడిన చోట ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారి ప్రాణాలు హరిస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంట కుంటల ప్రాధాన్యాన్ని వివరించండి

» వర్షాకాలం నాటికి నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



వీడియో కాన్ఫరెన్స్‌లోమాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పొలాల్లో సమీకృత నీటికుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి వర్షాకాలం నాటికి కుంటలు ఏర్పాటు చేసుకొనేలా ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉపాధి పథకం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టరేట్ నుంచి లక్ష్మీశ, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వేసవిలో ఉపాధి హామీ వేతనదారులకు తాగునీరు, ఇతర సౌకర్యాలపై సూచనలు చేశారు. రోజువారీ వేతనం రూ.300 వచ్చేలా చూడటంతో పాటు ఉపాధి పథకం అనుసంధానంతో చేపడుతున్న సమీకృత పంటకుంటలు, వివిధ పనులపైనా మార్గనిర్దేశనం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా నీటి యాజమాన్యసంస్థ, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ, నీటికుంటల ఏర్పాటుతో పంటకు కావాల్సిన నీటికి ఇబ్బందిలేకుండా ఉండటంతో పాటు నేల కోతకు గురికాకుండా, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదం చేస్తాయన్నారు. పంటకుంటల్లో చేపలు పెంపకం, గట్లపై కూరగాయల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు వివరించాలన్నారు. జిల్లాలో 289 గ్రామ పంచాయతీల పరిధిలో 2,713 కుంటలు మంజూరయ్యాయని యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము, డీపీవో పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మందుల షాపులపై డేగ కన్ను!

» షాపులు, ఏజెన్సీలపై ఈగల్ బృందాల ఆకస్మిక తనిఖీలు

» డాక్టర్ స్లిప్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు : ఐజీ రవికృష్ణ



గుణదల మెడికల్ షాపులో తనిఖీ అనంతరం మాట్లాడుతున్న ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ

గుణదల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ టీమ్ శుక్రవారం 'ఆపరేషన్ గరుడ' పేరుతో మెడికల్ షాపులు, ఏజన్సీలలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు ఐజీ రవికృష్ణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఈగల్ బృందాలు ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేయడం జరిగిందని, దానిలో భాగంగా గుణదల సెంటర్ మెడికల్ షాపులో ఆకస్మిక తనిఖీ చేసినట్టు చెప్పారు. ఔషధాల దుర్వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. యువత మత్తుకు బానిసలవుతున్నారని, గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను బుగ్గి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టేందుకుగాను మెడికల్ షాపుల్లో నిషేధిత మందుల విక్రయాలు, డాక్టర్ రాసిచ్చిన స్లిప్ లేకుండా మందుల విక్రయాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా అధికారులు షాపులో మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. అల్ప్రాజోలం అధిక మొత్తంలో స్టాకు పెట్టినా చర్యలు తప్పవన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్‌కంట్రోల్, ఈగల్‌టీమ్, పోలీసుశాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్, ఏడీ అనిల్‌కుమార్ స్పెషల్ ఫోర్స్ పోలీసులు దాడుల్లో పాల్గొన్నారు.

విజయవాడలో అత్యాధునిక హజ్ హౌస్

» ఇఫ్తార్ విందులో ఎంపీ కేశినేని శివనాథ్ హామీ



ఇఫ్తార్ విందులో ఎంపీ కేశినేని శివనాథ్, నెట్టెం, వసంత, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్ తదితులు

వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో అత్యాధునిక హజ్ హౌస్ నిర్మిస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) హామీ ఇచ్చారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం గురునానక్‌కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. ముస్లిం మత పెద్దలతో కలిసి ఎంపీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి అల్పాహారం ఆరగించారు. అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, టీడీపీ ముస్లిం సమాజానికి అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇమామ్, మౌజనులకు రూ.10వేలు, రూ.5వేలు గౌరవవేతనం అందిస్తున్నారన్నారు.అల్లా దయ వల్ల దేశం, రాష్ట్రం బాగుందన్నారు. విజయవాడ నగర అభివృద్ధిలో ముస్లింల పాత్ర చాలా ఉందని పేర్కొన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉండి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో హజ్ హౌస్ నిర్మాణం జరిగిందని, అంతకంటే అత్యాధునిక హజ్‌హౌస్‌ను నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఉర్దూ కాలేజీ టీడీపీ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యేలు గద్దే రామ్మోహన్, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఉగాది పచ్చడి పంపండి

» వలంటీర్లకు గోవిందరాజులు పిలుపు

గాంధీనగర్ : ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబుకు ఉగాది పచ్చడి పంపించాలని వలంటీర్ల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు వలంటీర్లకు పిలుపునిచ్చారు. పచ్చడి తిని గతంలో ఆయన ఇచ్చిన హామీని తీపి కబురుగా మార్చి తెలియజేయాలని కోరారు. స్థానిక దాసరిభవన్‌లో వలంటీర్ సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి అధికారం చేపడితే వలంటీర్లకు తీపికబురు చెబుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గంటా మమత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో షైనీ, నరేష్, కల్యాణ్, శివ పార్వతీ, స్వప్న, దమ్ము రమేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

కౌలు రైతులను మోసం చేసిన ప్రభుత్వం

» ఏపీ కౌలు రైతు సంఘం

గవర్నర్‌పేట : పాత కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, కౌలు రైతులకు మేలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి పార్టీలు పాత చట్టం రద్దు చేయకుండా, కొత్త చట్టం తీసుకురాకుండా నమ్మించి మోసం చేశాయని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కొత్త చట్టం తీసుకువస్తామని కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వ నమ్మించిందని, బడ్జెట్ సమావేశాలు ముగిసినా చట్టం మాత్రం రాలేదని అన్నారు. నూతన కౌలు చట్టం సాధించుకునేందుకు కౌలు రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా కాలయాపన మాని కౌలు రైతుల కోసం చట్టం తీసుకురావడం వ్యవసాయ రంగం అభివృద్ధికి చాలా అవసరమని పేర్కొన్నారు.

జామ్‌జామ్‌గా జంబో..!

(5వ పేజీ తరువాయి)

750 ఎకరాలను ఏఏఐకు ఇవ్వటంతో అదనంగా రన్‌వేను విస్తరించటానికి అవకాశం ఏర్పడింది. భూములను స్వాధీనం చేసుకున్న తర్వాత ఏఏఐ అధికారులు మరో 1,075 మీటర్ల మేర రన్‌వేను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2018 మధ్యకాలంలో నూతన రన్‌వే పనులు శరవేగంగా జరిగాయి. ఫలితంగా మొత్తంగా 3,360 మీటర్ల రన్‌వే ఏర్పడింది. అంటే 11,023.62 చదరపు గజాల మేర విస్తరణ జరిగింది. రాష్ట్రంలోనే అతిపెద్ద రన్‌వే కలిగిన విమానాశ్రయంగా విజయవాడ నిలిచింది. ఈక్రమంలో బోయింగ్-747, బోయింగ్-777, బోయింగ్-787 విమానాలు కూడా ల్యాండ్ కావటానికి వీలు కలిగింది.

రోజూ 8 భారీ విమానాల రాకపోకలు

విమానాశ్రయంలో ఒకేసారి 15 విమానాలను పార్కింగ్ చేసేలా పార్కింగ్ బేలను సిద్ధం చేశారు. ప్రస్తుతం శాశ్వత అవసరాల ప్రాతిపదికన దేశీయ, అంతర్జాతీయ నూతన టెర్మినల్ బిల్డింగ్ (ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్)ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీని పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ టెర్మినల్‌కు అనుసంధానంగా ఆప్రాన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఈ ఆప్రాన్‌లో ఒకేసారి ఆరు భారీ విమానాలను నిలిపే అవకాశం ఉంది. దీనిని ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. భారీ విమానాల సంఖ్య పెరిగినా ఇబ్బంది లేకుండా ఈ నూతన ఆప్రాన్‌ను సిద్ధం చేస్తున్నారు.

మరో షాక్..!

(5వ పేజీ తరువాయి)

చేయాల్సిందిగా ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాయటం విమర్శలకు తావిస్తోంది. ఇదంతా ఓ ఎత్తయితే.. అక్టోబరు వరకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వడం కుదరదని రాధా గ్రూప్ సంస్థ.. ఎన్‌హెచ్‌కు బదులివ్వడం కొసమెరుపు. అసలు విద్యుత్ ఉత్పత్తే చేయని రాధా గ్రూప్.. తమది కాని లైన్‌కు అక్టోబరు వరకు కుదరదని చెప్పడం విడ్డూరం. కొసమెరుపు ఏమిటంటే.. విద్యుదుత్పత్తి ఆపాలంటూ తమపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఒత్తిడి తెస్తున్నారంటూ రాధా గ్రూప్ న్యాయస్థానం మెట్లెక్కడం.

కేంద్ర ప్రభుత్వంపై రూ.250 కోట్ల భారం

ఎన్‌హెచ్ అధికారుల లేఖ వల్ల భవిష్యత్తులో రూ.250 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించే పరిస్థితి ఏర్పడింది. ఈ భారం కేంద్ర ప్రభుత్వంపై పడే అవకాశం ఉంది. జక్కంపూడి వీయూపీ వద్ద ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్పునకు 25 రోజుల పాటు విద్యుత్ అంతరాయానికి గడువు కోరడమంటే.. అన్ని రోజులకు రూ.250 కోట్లు చెల్లించాలి. ల్యాంకో పవర్ ప్రాజెక్టు పనిచేస్తున్న దశలో 2022, జూలై 9న ఎన్‌హెచ్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 32 గంటలకు జీఎస్టీతో కలిపి రూ.13 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీని ప్రకారం గంటకు రూ.43 లక్షలు చెల్లించాలి. 24 గంటలకు రూ.10.50 కోట్లు చెల్లించాలి. అంటే.. 25 రోజులకు రూ.250 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

కొనుగోలు కష్టాలు

(5వ పేజీ తరువాయి)

పూర్తయ్యాయని, ఇంకా అనుమతులు రాలేదని, ఇక రాకపోవచ్చని చెప్పి వెనక్కి పంపేస్తున్నారు. దీంతో జిల్లాలో పూర్తిస్థాయిలో కొనుగోలు నిలిచి పోయినట్లయింది. ఇటీవల 30 వేల టన్నుల ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాగా, అందులో 10 వేల టన్నులు కొన్నామని, ఇంకా 20 వేల టన్నులు ఈనెలాఖరులోగా కొంటామని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. ప్రైవేటుగా ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర రాకపోగా, బస్తాకు రూ.150 నుంచి రూ.225 నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

బీపీటీ-5204 రకం ధాన్యానికి మద్దతు ధర ఏదీ?

ఈ ఏడాది బీపీటీ-5204 రకం ధాన్యానికి ప్రైవేట్ మార్కెట్‌లో ఆశించిన మేర మద్దతు ధర లభించలేదు. అధిక శాతం ప్రజలు భోజనానికి ఉపయోగించే ఈ రకం ధాన్యానికి మార్కెట్‌లో ఏటా మంచి డిమాండ్ ఉంటుంది. గత ఏడాది ఇదే రోజుల్లో బీపీటీ రకం బస్తా ధాన్యాన్ని రూ.2,100కు రైతులు విక్రయించారు. ఈ ఏడాది రూ.1,700కు మించి ధర పలకడం లేదు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు వేసవిలో బీపీటీ ధాన్యం కొనేందుకు వస్తారని రైతులు ఆశించారు. అయితే, నెల్లూరు, కావలి ప్రాంతాల్లో రబీ సీజన్‌లో సాగుచేసిన బీపీటీ ధాన్యం ప్రస్తుతం కోతలు కోసి అందుబాటులోకి వస్తుండటంతో హైదరాబాద్ వ్యాపారులు ఆ ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. హైదరాబాద్ వ్యాపారులు వస్తే బీపీటీ రకం ధాన్యం ధరలు పెరిగేవని, ఈ ఏడాది ఆ పరిస్థితి కూడా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడకు బియ్యం ఎగుమతులు ప్రస్తుతం నిలిచిపోయాయని, రైతుల నుంచి ధాన్యం కొన్నా కొంతకాలంపాటు తమవద్ద నిల్వ ఉంచి ఎగుమతులు జరుగుతున్న సమయంలో మరపట్టి అక్కడకు తరలిస్తామని మిల్లర్లు చెబుతున్నారు.

మిగులుకైనా అనుమతులు ఇస్తారా..?

ఖరీఫ్ ధాన్యం ఇంకా 3.36 లక్షల టన్నులకు పైగా ఉంది. ఈ ధాన్యాన్ని వ్యాపారులు నిర్ణయించిన ధరకు విక్రయించాల్సి రావడంతో రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాక ఏప్రిల్‌లో రబీ సీజన్ ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తారు. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుంటే, మిగులుబాటు కోటాగా చూపి కొనేందుకు ప్రభుత్వం ఏటా అనుమతులు ఇస్తుంది. మిగులు ధాన్యం కోటాలోనైనా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనేందుకు అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

గడ్డి మేశారు!

(5వ పేజీ తరువాయి)

కాలువలకు అనుబంధంగా ప్రవహించే పంట కాలువలు, మురుగు కాలువలపై మొలకెత్తిన గడ్డి ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని అప్పటి ఏఈ, ప్రస్తుత జేఈతోపాటు సెక్షన్ల సిబ్బంది మింగేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ అధికారి విజయవాడలోని నదీ పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన చల్లపల్లిలో విధులు నిర్వర్తించారు. దీని పరిధిలోని గడ్డి వేలం ద్వారా వచ్చిన రూ.30లక్షలను నీటి వినియోగదారుల సంఘాల ఖాతాల్లో కాకుండా తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నట్టు ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనిపై ఆ సెక్షన్ పరిధిలోని రైతులు పలువురు కృష్ణాజిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు.

నివేదిక సిద్ధమైనా...

కలెక్టర్ ఆదేశాలతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. గడ్డిని వేలం ద్వారా దక్కించుకున్న రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి, రశీదులు ఇచ్చిన మాట వాస్తవమేనని గుర్తించారు. గడ్డి నిధులను మేయడంతో ఓ ఇంజనీరింగ్ అధికారితో పాటు లాకుల వద్ద విధులు నిర్వహించిన ఉద్యోగులు ఉన్నట్టు నిర్ధారించారు. దీనికి సంబంధించిన నివేదికను జలవనరుల శాఖ జిల్లా ఉన్నతాధికారులకు అందజేసినట్టు తెలిసింది. ఇద్దరు కీలక అధికారులు ఈ నివేదికను పరిశీలించకుండా తిరిగి పునఃవిచారణ చేయించాలని ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కొద్దినెలల క్రితమే ఈ నివేదిక అధికారుల టేబుల్ మీదకు వెళ్లినప్పటికీ సంబంధిత ఇంజనీర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి మీన మేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విచారణ నివేదిక ఒక టేబుల్ నుంచి మరో టేబుల్ పైకి ఇద్దరు ఉన్నతాధికారుల కనుసన్నల్లో తిరుగుతున్నట్టు తెలిసింది. అధికారులు ఈ గడ్డి లెక్కలను ఎప్పటికి తేల్చుతారన్న విషయం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

విద్యుత్ క్రమబద్ధీకరణ పోస్టరు ఆవిష్కరణ

పెనమలూరు, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు విద్యుత్‌శాఖ ఇస్తున్న 50శాతం రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో విద్యుత్ క్రమబద్ధీకరణ పోస్టరును శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. వినియోగదారునికి అందించే విద్యుత్‌లోడ్ వివరాలను విద్యుత్‌శాఖాధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. వివిధ టారిఫ్‌ల కింద విద్యుత్‌లోడ్లకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసినట్టు వారు ఎమ్మెల్యేకు తెలిపారు.



విద్యుత్ క్రమబద్ధీకరణ పోస్టరును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ బీసీ, ఓబీసీ, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, కార్పొరేషన్‌ల ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు 60ఏళ్లలోపు వయసు కలిగి, రూ.81వేలు వార్షిక ఆదాయం ఉంటే అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో శనివారం సాయంత్రంలోగా ఏపీఓబీఎం.ఎం.ఎం.ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్యాంపస్ ఎంపికలు

ఉయ్యూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మహాలిఫ్ట్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగాలకు క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. మహాలిఫ్ట్ కంపెనీ ఎండీ వి. మురళీ, జీఎం పూజిత విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి ఎంపికైన వారికి తర్వలోనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఇంటర్వ్యూలకు పలువురు విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల చైర్మన్ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ జి లక్ష్మీ ప్రతాప్, ఏవో మురళీకృష్ణ, బ్రాంచ్ విభాగాధిపతులు సిద్ధిరాజు, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ఉపాధిని దెబ్బతీయొద్దు

● గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరాజు

హనుమాన్‌జంక్షన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రాథమిక వైద్యసాయం అందిస్తున్న గ్రామీణ వైద్యులపై కొన్ని సంస్థలు చేస్తున్న దుష్ప్రచారం వల్ల వారి జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నూజివీడు రోడ్డులో హనుమాన్ జంక్షన్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వెంకటరాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు యాంటిబయోటిక్స్ స్టెరాయిడ్స్ వంటి మందులు మోతాదు మించి వాడుతున్నారనే దుష్ప్రచారాన్ని ఐక్యంగా ఎదుర్కోవాల్సి ఉందన్నారు. గ్రామీణ వైద్యులను నిర్వీర్యం చేసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్య సాయం కోసం క్వాలిఫైడ్ డాక్టర్లకు రిఫర్ చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. గ్రామీణ వైద్యులు ఎదుర్కొనే సమస్యలపై ఈ నెల 24,25 తేదీల్లో అనంతరపురంలో జరగనున్న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఫెడరేషన్ కార్యవర్గ సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. ఈ సందర్భంగా ఏలూరు ప్రభ హాస్పిటల్ ఎముకల వైద్య నిపుణులు పి.సునీల్ సందీప్ రోగులకు అందించే ప్రాథమిక వైద్య సాయంపై అవగాహన కల్పించారు. ఆ సంఘం హనుమాన్‌జంక్షన్ ప్రాంతీయ అధ్యక్షుడు కె.నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏరియా కార్యదర్శి కె.చైతన్య, జిల్లా నాయకులు కె.రాంబాబు, కె.రంగారావు, కెఎల్. కోటేశ్వరరావు,పి.శ్రీనివాసరావు, ఎల్.రవి, సీహెచ్.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బి. వెంకటరాజు

పదో తరగతి పరీక్షా కేంద్రంలో తనిఖీలు

ఉయ్యూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని మండల తహసీల్దార్ సురేష్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం వద్ద తాగు నీరు, ఇతర సదుపాయలను పరిశీలించారు. వైద్యశిబిరంలో అందుబాటులో ఉన్న మందులు, తదితర అంశాలను వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆరాతీశారు. పరీక్షల్లో ఎటువంటి కాపీయింగ్ జరుగకుండా తగుచర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.



పరీక్షా కేంద్రం తనిఖీచేస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

సకాలంలో ఇంటి, నీటి పన్నులను చెల్లించాలి

పెనమలూరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటిపన్నులు, నీటిపన్నులు సకాలంలో చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ సంయుక్తంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో నీటిపన్నుల అంచనాలు నమోదు చేయలేదని, దీంతో వినియోగదారులపై భారం పడుతుందన్నారు. దీన్ని రెండు విడతలుగా చెల్లించే అవకాశాన్ని ఇస్తున్నట్టు తెలిపారు.

హనుమాన్‌జంక్షన్: గ్రామాల్లో ఇంటిపన్ను, నీటి పన్నులనుఈ నెలాఖరు కల్లా నూరుశాతం వసూలు చేయడానికి పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని బాపులపాడు ఈవోపీఆర్‌డీ కె.లక్ష్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామపంచాయతీ సిబ్బందికి సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

పెనమలూరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఇబ్బందిపడేవారికి సీఎంఆర్ఎఫ్ పూర్తి భరోసా ఇస్తుందని తాడిగడప మునిసిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావుతెలిపారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీహయాంలో ఏకుటుంబానికీ సరైన వైద్య సహాయం అందలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధిని తిరిగి అమల్లోకి తెచ్చి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా వందలకోట్లను సామాన్యుల ఆరోగ్యానికి ఖర్చు చేశారని తెలిపారు. ఈడుపుగల్లు గ్రామానికి చెందిన కాసరనేని పద్మశ్రీకి 60వేలు, తాడిగడప గ్రామానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్‌కు మూడున్నర లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్ రాంకుమార్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న ప్రభాకరరావు

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోసాల సమీపంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పెనమలూరు పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.వారి వద్ద నుంచి రూ.15,700 లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

ఉయ్యూరు : గండిగుంటలో శుక్రవారం పీ 4 సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరి రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 సర్వేను దాతలు, ప్రజల భాగస్వామ్యంతో ఉగాది నుంచి ప్రారంభించనున్నామన్నారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ 4 అమలు జరుగనుందన్నారు. గ్రామంలో 2250 కుటుంబాలలను సర్వేచేసి 397 అట్టడుగు పేద కుటుంబాలను గుర్తించామన్నారు.

బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించటం అభినందనీయం

కంకిపాడు : బేడ బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు అసెంబ్లీ సమావేశంలో ప్రకటించటం హర్షణీయమని బేడ జంగం అభివృద్ధి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి రావు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు ఈ సందర్భంగా శుక్రవారం వారు పాలాభిషేకం చేశారు. బేడ బుడగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శివాలయ అభివృద్ధికి కృషి

కంకిపాడు : శివాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకులు పులి శ్రీనివాసరావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయం అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని శివాలయం అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఎంతో చరిత్ర కలిగిన శివాలయం అభివృద్ధికి దాతలతో పాటు, దేవాదాయ శాఖ కూడా ముందుకొచ్చి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శివాలయం ప్రధాన అర్చకులు సుబ్బారావు, కిషోర్, టీడీపీ నాయకులు వణుకూరు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఎంఆర్‌పీఎస్ నేతల హర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలతో మాదిగ జాతి భవిష్యత్తు బాగుంటుందని తెలుగు యువత అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బొమ్ములూరులోని బాబూజగ్జీవన్‌రాం విగ్రహానికి శుక్రవారం నివాళులర్పించారు.గాలంకి వినయ్, దిరిసెన వంశీ, పచ్చిగల్ల శ్రీను, రాజేష్, పొలిమెట్ల వాసు పాల్గొన్నారు.

గన్నవరం: ఎస్సీ వర్గీకరణ చట్టం కృష్ణ మాదిగ పోరాటాల ఫలితమేనని ఎంఈఎఫ్ జిల్లా కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు అన్నారు. స్థానిక బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్, దేవదాసు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ : ఎస్సీ వర్గీకరణ బిల్లు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం అవడంపై టీడీపీ ఎంఆర్‌పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు బుకినాల తిరుపతిరావు, నేతలు గంపా శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : వీరవల్లిలోని షిరిడిసాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవ పూజలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసరావు, రాజేశ్వరశర్మల ఆధ్వర్యంలో తెల్లవారుజామున బాబాకి పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. తదనంతరం అష్టోత్తర శతనామావళి గానం చేయగా, ప్రత్యేక అలంకరణలో బాబా వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయకమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, లంక బేబిసరోజిని, నందమూరి సంధ్య శ్రీలక్ష్మి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు నాలుగువేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.



స్టడీ టూర్‌కు వెళుతున్న విద్యార్థులు

అధ్యయన పర్యటనకు విద్యార్థుల ఎంపిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఆచరణాత్మక అభ్యాస అనుభవాన్ని పెంపొందించేందుకు స్టడీటూర్(అధ్యయన పర్యటన) ఉపయోగపడుతుందని ఎంఈవో రాంబాలాసింగ్ అన్నారు. వేలేరు నేతాజీ సుభాస్‌చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు సమగ్ర శిక్ష అభియాన్, కృష్ణాజిల్లావారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీ టూర్‌కు శుక్రవారం వెళ్లారు. మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఎంపికైన 8వ తరగతి విద్యార్థులు ఈశ్వర్, వీరవెంకట జగదీష్‌భాస్కర్‌లు 22వతేదీ వరకూ జరిగే స్టడీ టూర్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా చెన్నై, తిరుపతి, చంద్రగిరి తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడి సామాజిక, ఆర్థిక, వ్యవహారాలపై అవగాహన పెంపొందించుకునేందుకు సహాయకారి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సునీత, గైడ్ టీచర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

మినుముకు మద్దతు ధర ప్రకటించాలి

ఉయ్యూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మినుముకు కనీస మద్దతుధర క్వింటాకు రూ. 9,000గా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కోసూరి శివనాగేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాటూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 7,400 రైతులకు ఏమాత్రంగిట్టుబాటుకాదని, మార్కెట్‌లో ప్రస్తుతం ఇదే ధరకు కొంటున్నారని తెలిపారు. జిల్లాలో దాళ్వా సాగులేకపోవడంతో అధిక శాతం రైతులు రెండో పంటగా మినుము సాగుచేసి అధికంగా పెట్టుబడి పెట్టారన్నారు. ప్రస్తుత ధరకు అమ్ముకుంటే పెట్టుబడిలో సగంకూడా రాని పరిస్థితి ఉందని , దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆరుగాలం కష్టపడి రైతులు, కౌలు రైతులు ఇప్పటివరకు ఎంతో ఖర్చు చేసారని వివరించారు. సంఘం సీనియర్ నాయకుడు అన్నే సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివనాగేంద్రం

పోక్సోచట్టంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న గన్నవరం కోర్టు న్యాయమూర్తి శిరీష

ఉంగుటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి చదువుపై దృష్టిసారించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించాలని గన్నవరం ఎనిమిదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.శిరీష అన్నారు. ఉంగుటూరు జెడ్పీహైస్కూల్‌లో గన్నవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడే నేరగాళ్ల బారినుంచి 18ఏళ్లలోపు బాలబాలికలకు రక్షణ కల్పించేందుకు 2012లో ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్)చట్టంపై విద్యార్థులందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. లైంగిక దాడులను అడ్డుకునేందుకు బాలికలు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌పై పట్టు సాధించి స్వీయరక్షణకు సంసిద్ధులై వుండాలన్నారు.ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎస్‌టీజీ నీరజ, ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు, గన్నవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి రవికుమార్, ఉపాధ్యక్షులు లోకం వేణుబాబు,ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రమేష్, పి.శ్రీనివాసరావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం టి.అనంతయ్య పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలను అరికట్టాలి : సీపీఎం

గన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలను నియంత్రించేందుకు పోలీసు అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి యువత జీవితాన్ని సర్వనాశనం చేస్తుందన్నారు. జల్సాలకు అలవాటు పడిన యువకులు గంజాయిని తీసుకొచ్చి విక్రయించటం, సేవించటం చేస్తున్నట్టు తెలిపారు. గంజాయి సేవించిన యువకులు మత్తులో ఆడపిల్లలపై అఘాయిత్యాలకు తెగబడుతున్నారని వివరించారు. నేతలు వెంకటేశ్వరరావు, ఏసుదాసు, సాంబశివరావు, మీరాఖాన్, మరియదాసు, రాంబాబు పాల్గొన్నారు.

రోగుల ప్రశంసలతోనే ఒత్తిడి దూరం

● ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల

గన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రోగులకు చిరునవ్వుతో సేవలందించినప్పుడే నర్సులు ఒత్తిడిని జయిస్తారని ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ వృత్తిలో ఎదుర్కొనే ఒత్తిడిని తట్టుకునే పద్ధతులపై రాష్ట్రస్థాయి నర్సింగ్ కాన్ఫరెన్స్ అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుశీల మాట్లాడుతూ ఆస్పత్రులలో నర్సులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ పనినైనా ఇష్టపూర్వకంగా చేస్తుంటే ఒత్తిడి అనిపించదన్నారు. ప్రస్తుతం 18-25ఏళ్లలోపు యువతీయువకులు ఎదుర్కొంటున్న అసాధారణమైన ఒత్తిడి చిన్నపాటి విషయాలు, సెల్‌ఫోన్, సోషల్ మీడియా ప్రభావం వల్ల మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయని వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సింగ్ విద్యార్థినులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. రాష్ట్రంలోని 18 కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు హాజరు కాగా అందరికి సర్టిఫికెట్లు అందజేశారు. రిసోర్స్‌స్పీకర్స్‌గా సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్లోరెన్స్ కోటేశ్వరమ్మ, సిద్ధార్థ నర్సింగ్ ప్రిన్సిపాల్ జె.వందన, డాక్టర్ ఝాన్సీ రాణి వ్యవహరించగా మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల కన్వీనర్ వీరపనేని శశికళ, డాక్టర్ భీమేశ్వర్ పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న ప్రొఫెసర్ కె.సుశీల

విద్యార్థులు, యువతను ఆధునిక సైన్స్, టెక్నాలజీ వైపు నడిపిస్తోంది గోరా టెక్నో హబ్. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అంతరిక్షంలో సంభవిస్తున్న వివిధ రకాల పరిణామాల గురించి త్వరితగతిన తెలుసుకునేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన చంద్రయాన్-3, ఆర్యభట్ శాటిలైట్, సర్వే డ్రోన్ నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. హోమ్ ఆటోమిషన్, రాకెట్ లాంచింగ్ వంటి ఎన్నో అంతరిక్ష అద్భుతాలు కనువిందు చేస్తున్నాయి.


రాకెట్ లాంచ్ నమూనా

విజ్ఞాన లోకం

- ఇగ్నైట్, ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ అనే నినాదంతో కేంద్రం స్థాపన

యువతలో సైన్స్, టెక్నాలజీ ప్రేరణకు గోరా టెక్నో హబ్ దోహదం

- ఆకట్టుకుంటున్న రోబో గైడ్, అంతరిక్షశాల
- అబ్బురపరుస్తున్న చంద్రయాన్-3, ఆర్యభట్ శాటిలైట్, సర్వే డ్రోన్ నమూనాలు
- హోమ్ ఆటోమిషన్, రాకెట్ లాంచింగ్ వంటి ఎన్నో అంతరిక్ష అద్భుతాలు

ఆంధ్రజ్యోతి-బెంజిసర్కిల్: యువతలో సైన్స్, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సుల పట్ల ఆసక్తి పెంచి రాబోయే తరం వారిని యంగ్ సైంటిస్టులుగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో విజయవాడ బెంజిసర్కిల్ నాస్తిక కేంద్రంలో గోరా టెక్నో హబ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ రెగ్యులర్‌గా వర్క్‌షాప్‌లు, సెమినార్‌లను నిపుణులైన సైంటిస్టులతో ఏర్పాటు చేసి విద్యార్థులను భాగస్వాములను చేస్తారు. ఆదివారం మినహా వారంలో మిగిలిన ఆరు రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సందర్శకుల కోసం ఈ హబ్‌ను తెరిచి ఉంచుతారు.

రోబోనే గైడ్‌గా..

ఈ హబ్‌లో రోబోనే గైడ్‌గా వ్యవహరిస్తోంది. శాస్త్ర, సాంకేతిక అంశాలను సందర్శకులకు వివరించేందుకు మిలాన్ అనే పేరుతో ఒక రోబోను ఏర్పాటు చేశారు. ఇది అక్కడ పొందపరిచిన అంశాలను ఆంగ్లంలో కళ్లకు కట్టినట్లు వివరిస్తోంది. భారత్ మొదటి శాటిలైట్ అయిన ఆర్యభట్ నమూనా, సర్వే డ్రోన్, విద్యుత్ స్విచ్‌లతో పనిలేకుండా సెల్‌ఫోన్ ద్వారానే లైట్‌లు ఆఫ్, ఆన్‌కు ఉపయోగపడే హోమ్ ఆటోమేషన్ ఈటెక్నో హబ్‌లోని ప్రదర్శనలో దర్శనమిస్తాయి. చిన్నపాటి రాకెట్ నమూనా, 3డీ ప్రింటింగ్ ప్రొడెక్స్ ఈ ప్రదర్శనలో ఉంచారు. ఒక వ్యక్తి ఏ గ్రహంపై ఎంత బరువు ఉంటాడో కూడా పొందు పరిచే టీవీ స్క్రీన్ కూడా ఇక్కడ ఉంది. ఒక మిషన్ కింద నిలబడితే వ్యక్తి సెంటిమీటర్లు, అడుగుల్లో ఎంత ఎత్తు ఉంటాడో తెలియజేసే నో యువర్ హైట్ మిషన్ కూడా ఏర్పాటు చేశారు.

అంతరిక్షశాలలో అద్భుతాలు

ఇక్కడ అంతరిక్షశాలలో అనేక అద్భుతాలు కనిపిస్తాయి. ఆకాశంలో నక్షత్రాలు రాత్రిపూట ఏవిధంగా ఉంటాయో ఇక్కడ చూడవచ్చు. చైనా మొదటి స్పేస్‌స్టేషన్ చిత్రాలు, చంద్రయాన్-3 నమూనా, జర్నీ ఆఫ్ స్పేస్, సర్క్యూట్స్ అభివృద్ధి, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం చిత్రం, సోలార్ సిస్టం పనిచేసే విధానం తదితర అంశాలు కూడా ఈ హబ్‌లో పొందుపరిచారు.



ఆర్యభట్ట శాటిలైట్ నమూనా

నూతన ఆవిష్కరణలకు దోహదం



గోరా టెక్నో హబ్‌లో పొందుపరిచిన వివిధ నమూనాలు, అంశాలు నూతన ఆవిష్కరణలకు దోహదపడే విధంగా ఉన్నాయి. తెలియని ఎన్నో విషయాలను ఆ ప్రదర్శన ద్వారా తెలిసుకోగలిగాం. మిలాన్ పేరుతో ఏర్పాటు చేసిన రోబో సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన పలు విషయాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తోంది.

- నల్లా సాయిహర్షిత, విద్యార్థిని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

శాస్త్ర, సాంకేతిక అంశాలపై ప్రేరణ



టెక్నో హబ్‌లోని ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల నమూనాలు శాస్త్ర, సాంకేతిక అంశాలపై ప్రేరణ కలిగించే విధంగా ఉన్నాయి. యువ శాస్త్రవేత్తలుగా తయారయ్యేందుకు ఇది మార్గదర్శకం అవుతోంది. తెలియని ఎన్నో విషయాలను తెలిసుకోగలిగా. ముఖ్యంగా అంతరిక్షశాలను కూడా ఇక్కడ చూడగలిగా. ఎంతో ఆనందంగా ఉంది.

- డి.రిహాల్, విద్యార్థి, పీబీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల

విద్యార్థులు, యువతను ప్రోత్సహించేందుకే..



విద్యార్థులు, యువతను రోబోటిక్ సైన్స్ టెక్నాలజీ రంగాల వైపు ప్రోత్సహించేందుకే గోరా టెక్నో హబ్‌ను స్థాపించారు. ఇది శాశ్వత ప్రాతిపదికన ఉంటుంది. ఈ హబ్‌లో అంతరిక్ష శాలనే ఏర్పాటు చేశాం. ఇగ్నైట్, ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ అనే నినాదంతో యువతలో సైన్స్ పట్ల కుతూహలం, ఆసక్తి, పరిశోధన నూతన ఆవిష్కరణల వైపు దృష్టి పెట్టేందు ఇది దోహదపడుతుంది.

- డాక్టర్ జి. సమరం, గోరా టెక్నో హబ్ చైర్మన్



వంద మోటార్లలో కేబుల్ వైరు చోరీ


పాములలంకలో కేబుల్ వైరును చూపుతున్న రైతు వెంకటేశ్వరరావు

తోట్లవల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాములలంకలో వంద వ్యవసాయ సబ్‌మెర్సిబుల్ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను గురువారం అర్థరాత్రి దొంగలు కత్తిరించుకుపోయారు. రైతులు శుక్రవారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు బోర్ల వద్దకు రాగా, కేబుల్ వైర్లు కత్తిరించి ఉండటం చూసి షాక్ అయ్యారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక పొలాల్లో, ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట డొంక ఏరియాలో వంద మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకుపోయారని రైతులు కర్రా నాగరాజు, శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. పంటలకు నీరు పెట్టాలంటే మళ్లీ కేబుల్ వైర్లను కొనుగోలు చేసి మెకానిక్ చేత పని చేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఒక్కో రైతుకు రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికి 15 సార్లు కత్తిరించుకుపోయారు..

రాగివైరు కోసమే దొంగలు మోటార్ల కేబుల్ వైర్లను కత్తిరించుకుపోతున్నారు. మండలంలో ఇది 15వ ఘటనగా రైతులు చెబుతున్నారు. వివిధ గ్రామాల్లో 15 పర్యాయాలు కేబుల్ వైర్లు దొంగిలించినా ఇంత వరకు పోలీసులు ఒక్క దొంగను కూడా పట్టుకోలేకపోవటం తమకు శాపంగా మారిందని రైతులు విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టటం లేదని వాపోతున్నారు. కేబుల్ వైర్ల దొంగతనాలు ఒకరిద్దరు చేసే పనికాదని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ దొంగల ముఠాను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

24న 'ఎన్టీఆర్ వైద్య సేవ' సిబ్బంది ఆందోళన

బెంజిసర్కిల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 24వ తేదీన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం సిబ్బంది ఆందోళన చేస్తారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవిందు, ప్రధాన కార్యదర్శి గురవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. బంగారుశ్రీ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని జిల్లాల్లోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో-ఆర్డినేటర్(డీసీ)కార్యాలయాల వద్ద శాంతియుత వాతావరణంలో ఆందోళన జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 27న మంగళగిరిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద గాంధీ మార్గంలో నిరసన తెలియజేస్తామని తెలిపారు.

నేడు పంట కుంటల తవ్వకం ప్రారంభం



కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల తవ్వకాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 3 వేల పంట కుంటలను లక్ష్యంగా పెటుకున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల్లోను, అన్ని గ్రామ పంచాయితీల్లోనూ పంట కుంటల పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పంట కుంటలతో పాటుగా వాటి గట్లపై కూరగాయలు మొక్కలు పెంచడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. అలాగే పంట కుంటల్లో చేపలను పెంచడం ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

త్వరలో సిమెంట్ రోడ్లు, గోకులాల ప్రారంభోత్సవం

ఉగాది నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక వారోత్సవాలు ద్వారా పల్లె పండుగలో మంజూరై పూర్తి చేసిన సిమెంట్ రోడ్లు, గోకులాలను ప్రజాప్రతినిధులతో కలిపి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పూర్తి చేయాల్సిన సిమెంట్ రోడ్లను ఈ నెలాఖరుకు పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయవలసిందిగా పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ తెలియజేశారని కలెక్టర్ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్‌పై కేసు

పాయకాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ సస్పెక్ట్ షీటర్‌పై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. శాంతినగర్ ప్రాంతానికి చెందిన కుందేటి గణేష్ అలియాస్ గనికి నున్న రూరల్ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ సస్పెక్ట్ షీట్ ఉంది. గత కొంత కాలంగా స్టేషన్‌లో సంతకాలకు రాకుండా తిరుగుతున్న గని వాంబేకాలనీ వైఎస్సార్ పార్క్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతని వద్ద 21 కేజీల గంజాయి ఉండటాన్ని గుర్తించారు. దీంతో గనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కాగా సస్పెక్ట్ షీటర్ గనిపై నగరంలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో 24 కేసులు ఉన్నాయి.

మ్యాన్‌హోల్‌తో ముప్పు!



పైలట్ ప్రాజెక్టు ద్వారా గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మ్యాన్‌హోల్ మూత లేకుండా చెవిటికల్లు ఎస్సీ కాలనీలో ప్రమాదభరితంగా ఉంది. 12 అంగుళాల వెడల్పు, సుమారు ఎనిమిది అడుగుల లోతు ఉన్న మ్యాన్‌హోల్‌లో నీరు చేరింది. దీని పక్క నుంచే చిన్నారులు నిత్యం అంగవాడీ కేంద్రానికి వెళ్లి వస్తుండటంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మూతలేకుండా వదిలేసిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి-కంచికచర్ల రూరల్

ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం

- రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర
- కలెక్టర్‌తో కలిసి గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన


ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించి కలెక్టర్ బాలాజీతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతంగా పూర్తి చేసి, మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం కలెక్టర్ బాలాజీతో కలిసి గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గిలకలదిండిలోని మత్స్యశాఖ కమ్యూనికేషన్స్ స్టేషన్‌లో ఫిషింగ్ హార్బర్ చిత్రపటాన్ని పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఫిష్ హ్యాండ్లింగ్, ఆక్షన్ హాల్, ఐస్‌ప్లాంట్, రేడియో కమ్యూనికేషన్ భవనాలను సందర్శించారు. పడవల తయారీ కేంద్రంపై అధికారులతో చర్చించారు.

37 శాతం మాత్రమే పూర్తయ్యింది..

మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. రూ. 421 కోట్లతో 2021 మార్చిలో హార్బర్ నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ 37 శాతం మాత్రమే పూర్తయ్యాయన్నారు. నిర్ణీత గడువు ముగిసినందున మళ్లీ నిర్మాణ కాలం గడువు పొడిగింపునకు, నిధుల మంజూరుకు మారిటోరియం బోర్డు ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. డ్రెడ్జింగ్ పనులు కొంత వరకు మాత్రమే జరిగాయన్నారు. సముద్ర ముఖ ద్వారం డిజైన్ ఇంకా నిర్ధారణ కాలేదన్నారు. దీనిపై చెన్నై ఐఐటీ నివేదికను అందించాల్సి ఉందన్నారు. ఈ నివేదికను తక్షణమే తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌లో వివిధ రకాల భవనాల నిర్మాణాలు, తాగునీరు, రహదారుల నిర్మాణ పనులు వేగవంతంగా జరిపిస్తామన్నారు. 2025 ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేట నిషేధ కాలం ఉంటుందని, ఈలోగా అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. 1999లో అప్పటి మంత్రి నడకుదిటి నరసింహారావు చొరవతో ఈ ప్రాంతంలో రూ. 7 కోట్ల 50 లక్షలతో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాను రాను ఫిషింగ్ హార్బర్ ప్రాముఖ్యత తగ్గిపోతూ వచ్చిందని, తిరిగి ప్రాభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయిల్ కంపెనీ నిర్మాణం చేపట్టేందుకు, లాంగ్‌లైన్ నిర్మాణానికి స్థలం గుర్తించామన్నారు. ఇండస్ట్రీయల్ పార్కు కోసం ఏపీ ఐఐసీ ద్వారా 300 ఎకరాలు అప్పగించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇక్కడే ఏరైన్ బోర్డు సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను సమీక్షిస్తామని వివరించారు. మత్స్యశాఖ అధికా రి నాగబాబు, మారిటోరియం బోర్డు కన్సల్టెన్సీ ఏపీ అర్బన్ సీనియర్ ఇంజనీర్ శశికుమార్, ప్రాజెక్టు మేనేజర్ ప్రసాదరావు, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు

క్రీడా పోటీల విజయవంతంపై శాప్ చైర్మన్ కృతజ్ఞతలు


ఉద్యోగులతో మాట్లాడుతున్న రవి నాయుడు

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల క్రీడా పోటీలు విజయవంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. శుక్రవారం శాప్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశాలతో ఈ పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, రామ్‌ప్రసాద్ రెడ్డి, దుర్గేష్, పయ్యావుల కేశవులు సహకారంతో నిర్వహించామని తెలిపారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలి

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి



సదస్సులో పాల్గొన్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి తదితరులు

కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి సూచించారు. గవర్నర్‌పేట, రైతు శిక్షణ కేంద్రం సమావేశ మందిరంలో శుక్రవారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం ఆధ్వర్యంలో రెవెన్యూ సేవలపై అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలకు శిక్షణా సదస్సు జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి పాల్గొని నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శ కాలకు అనుగుణంగా రెవెన్యూ సేవలు అందించడంతో పాటు ఏమైనా సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం తదితరాలపై మార్గనిర్దేశనం చేశారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి వచ్చే ఆరు నెలల సమయం చాలా కీలకంగా ఉన్న నేపథ్యంలో ఎక్కడా జాప్యం లేకుండా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించేందుకు, డేటా నమోదులో కచ్చితత్వానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికా రులపై ఉందన్నారు. ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ఖచ్చితంగా అమలు చేసి కేసులు నమోదు చేయాలన్నారు.

అన్ని శాఖలకు మూలం

అన్ని శాఖలకు మూలం రెవెన్యూ శాఖ అని ఈ శాఖ ద్వారా నాణ్యమైన ఖచ్చితమైన సేవలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పేపర్ లెస్, స్మార్ట్ గవర్నెన్స్ సేవలు అందేలా తీర్చిదిద్దాలని చెప్పారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. రీసర్వేపై సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల డైరెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, ఈనాం, ఎస్టేట్, పీఓటీ చట్టాలపై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనరసింహం, రికార్డ్ ఆఫ్ రైట్స్, భూ ఆక్రమణలు, ల్యాండ్ గ్రాబింగ్‌పై విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.రామయ్య శిక్షణ ఇవ్వగా, వెబ్‌ల్యాండ్ సంబంధిత అంశాలపై ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.రచన వివరించారు. మీ భూమి - మీ హక్కు నినాదంతో భూములకు రక్షణ కల్పించేలా వచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) చట్టం-2024 గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడనున్నాయి.

హజ్ యాత్రకు 1,630 మంది ఎంపిక

వన్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి 1,630 మంది యాత్రికులను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండీ గౌస్ పీర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాత్రికులు తమ వ్యక్తిగత సూచనల మేరకు వివిధ విమానాశ్రయాల ద్వారా ప్రయాణం చేయుటకు, ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తు నమోదు చేసుకునేందుకు రెండు ఆప్షన్‌లు ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఆ ఆప్షన్‌ల వారీగా వివిధ ఎంబార్కేషన్ పాయింట్ల నుంచి యాత్రికులు బయలుదేరుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి 1,096 మంది, బెంగళూరు నుంచి 454 మంది, విజయవాడ నుంచి 71 మంది, ఇతర ఎంబార్కేషన్ పాయింట్‌ల నుంచి తొమ్మిది మంది బయలుదేరతారని తెలిపారు. విజయవాడ నుంచి బయలుదేరే 71 మంది విజయవాడ నుంచి కాక, హైదరాబాద్‌ను రెండవ ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కొరకు హైదరాబాద్, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు.

పాత పెన్షన్ సాధించే వరకు ఉద్యమం

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు నాగేంద్ర బాబు


డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

రైల్వే స్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన రైల్వే కార్మికులకు ఆసరాగా ఉండే పాత పెన్షన్‌ను సాధించేంత వరకు ఉద్యమిస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎడ్ల నాగేంద్ర బాబు అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య ఇచ్చిన పిలుపు మేరకు ఆలిండియా ప్రొటెస్ట్ వీక్‌లో భాగంగా శుక్రవారం విజయవాడ డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నాగేంద్ర బాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తే కంటి తుడుపు చర్యగా యూపీఎస్‌ను ప్రవేశ పెట్టి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు 12 గంటల రోస్టర్‌ను ఎదుర్కొంటున్నారని, వారికి 8 గంటల రోస్టర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు.

25 నుంచి కౌలురైతు సంఘం ఆందోళనలు

బెంజిసర్కిల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నూతన కౌలు రైతుల చట్టం వెంటనే తీసుకురావాలని కోరుతూ ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లోని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కాటమయ్య, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. అధికారంలోకి ఇచ్చిన వెంటనే కౌలురైతులకు భూయజమాని ప్రమేయం లేకుండా నేరుగా గుర్తింపు కార్డులు జారీచేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. భూమి లేని ప్రతి కౌలు రైతు కుటుంబానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. భూసారాన్ని పెంచడానికి సాయిల్ టెస్ట్ ఆధారంగా సూక్ష్మ పోషకాలను 90 శాతం సబ్సిడీపై కౌలురైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో చోరీకి యత్నం

కూచిపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి తాళాలు పగులకొట్టి షట్టరు తెరిచేందుకు యత్నించి విఫలం చెందారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న పామర్రు సీఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్ఐ కె.ఎన్.విశ్వనాథ్ ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్ బృందం సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారని, అయితే బ్యాంక్ లోపలికి ప్రవేశించలేదని, బ్యాంక్‌కు ఏలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరించటంతోపాటు సీసీ పుటేజీని పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలియజేస్తూ ప్రజలు, దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులపై పోలీసులకు తగు సమాచారం అందించాలని కోరారు.

ఉగాది సేవా పతకాలకు పలువురి ఎంపిక

మచిలీపట్నం, మార్చి21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన పోలీస్, అగ్నిమాపకశాఖల ఉద్యోగు లు, అధికారులను ఉగాది పురస్కారాలకు ఎంపిక చేస్తూ ప్రభుత్వం జీవో నంబరు 58ను జారీ చేసింది. ఉత్తమ సేవా పురస్కారానికి డీఎస్‌బీ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్ఐ వై.లక్ష్మణరావు ఎంపికయ్యారు. సేవా పతకానికి డీఎస్‌బీ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్ఐ కె.హేమచంద్రం, మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కేవీ శ్రీనివాసరావు, అవనిగడ్డ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కే వెంకటేశ్వరరావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు జే నందకిషోర్, ఎస్‌కే ఇబ్రహీం, మహిళా ఎస్ఐ బీ శాంత కుమారి, గుడివాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎస్‌కే రీహన్, కంకిపాడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పీ రాధాకృష్ణ ఎంపిక చేశారు. అగ్నిమాపకశాఖలో బంటుమిల్లి ఫైర్‌స్టేషన్ అధికారి జీ వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఫైర్ స్టేషన్ ఫైర్‌మాన్ ఏ వెంకటదుర్గాప్రసాద్, హనుమాన్‌జంక్షన్ ఫైర్‌స్టేషన్ డ్రైవర్ కం ఆపరేటర్ పి సాంబశివరావు సేవా పతకాలకు ఎంపికయ్యారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435	



గుడివాడలో 'ఆపరేషన్ గరుడ'

● మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

గుడివాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ గరుడ కార్యక్రమంలో భాగంగా గుడివాడలోనూ శుక్రవారం ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు, డ్రగ్ డిపార్టుమెంట్ అధికారుల ఆధ్వర్యంలో మెడికల్ షాపులు, మెడికల్ ఏజెన్సీలపై దాడులు నిర్వహించారు. భీమవరం రైల్వేగేటు పక్కన ఉన్న పాత డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆస్పత్రిలోని మెడికల్ షాపు, ఏలూరురోడ్డులోని షణ్ముఖ ఏజెన్సీపై సమాచారం బయటకు రాకుండా పకడ్బందీగా దాడులు చేశారు. రెండు రోజులుగా గుడివాడలోని పలు ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో తనిఖీలు చేసినట్టు సమాచారం.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

● పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి)

మొవ్వ మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయి. గుడి, బడి, నివాస ప్రాంతాలనే తేడా లేకుండా బెల్టుషాపుల ద్వారా యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎక్సైజ్, పోలీసు శాఖ కనుసన్నల్లోనే బెల్టుషాపుల హవా కొనసాగుతోందని విమర్శలు వెల్లువెత్తున్నాయి. కూచిపూడి, మొవ్వ, పెదపూడి, నిడుమోలు, కాజ, కోసూరు, చినముత్తేవి, పెద్దముత్తేవి, అయ్యంకి గ్రామాలతో పాటు మండలంలోని 21 పంచాయతీల్లోనూ బెల్టుషాపుల ద్వారా రేయింబవళ్లు విక్రయాలు సాగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు నామమాత్రపు దాడులైనా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలంలో నిడుమోలు, కూచిపూడి, మొవ్వ, కాజ గ్రామాల్లో ప్రభుత్వ అనుమతి పొందిన నాలుగు మద్యం దుకాణాలు ఉండగా, వాటికి సమాంతరంగా బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారని, వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జగన్ ప్రభుత్వం కాదిది

● కూటమి ప్రభుత్వమని అధికారులు, కాంట్రాక్టర్లు గుర్తెరిగి పనిచేయాలి

● అసంపూర్తి ఇరిగేషన్, డ్రెయినేజీ పనులన్నీ పూర్తి చేయాలి

● డీసీలు, ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో సమీక్షలో తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు



వడ్లమన్నాడు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, అధికారులు

గుడ్లవల్లేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వం కాదిది. కూటమి ప్రభుత్వంలో పనిచేస్తున్నాం. అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు అందరూ అది గుర్తెరిగి పనిచేయాలి. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్ల, అప్పట్లో అధికారుల అలసత్వం కారణంగా కాంట్రాక్టర్లు సరిగా పనిచేయక కృష్ణాడెల్టాలో ఇరిగేషన్, డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా నిర్వహించారు. రైతులను కష్టాల పాల్జేశారు. రాబోయే రోజుల్లో రైతులకు ఏ ఇబ్బందీ కలగకుండా పనులన్నీ చేయాలి.' అని తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరు ఇరిగేషన్ బంగ్లాలో డీసీలు, ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో ఆయ న సమీక్ష నిర్వహించారు. ఎక్కడ సమస్యలు ఉన్నాయి, ఏ పనులు అత్యవసరం, ప్రాధాన్య క్రమంలో ఏ పనులు ముందుగా చేయాలనే దానిపై చర్చించారు. ఇరిగేషన్, డ్రెయినేజీలకు సంబంధించిన ఏ సమస్యనైనా తన దృష్టికి తేవాలని పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు సూచించారు. రైతులకు అధికారులకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేసి రైతాంగానికి మంచి జరిగేలా చూస్తానన్నారు. ఆంధ్రజ్యోతిలో 'పుల్లేరులో తూడు తొలగించరూ' పేరుతో ప్రచురితమైన కథనాన్ని పీసీ చైర్మన్ దృష్టికి నీటి సంఘం అధ్యక్షుడు శాయన ప్రసాద్ తెచ్చారు. పుల్లేరులో ఎగువ నుంచి వస్తు న్న మురుగునీటిని గుడ్లవల్లేరు లాకులవద్ద నిలువపెట్టడంతో లాకుల నుంచి మామిడికోళ్ల వరకూ తూడు పెరిగిపోయిందని, లాకుల వద్ద నీరు తగ్గించి తూడు నిర్మూలించే సమయంలో కాంట్రాక్టరుతో పని చేయించడంలేదని వివరించారు. వడ్లమన్నాడులో వడ్లమన్నాడు డ్రెయిన్‌ను అధికారులు, డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వరచౌదరితో కలిసి పీసీ చైర్మన్ పరిశీలించారు. వడ్లమన్నాడు డ్రెయిన్ అధ్వానంగా ఉందని వెంటనే దానిని తవ్వించాలని అధికారులకు సూచించారు. డీసీ చైర్మన్ పాలేటి వెంకటవీర ఆంజనేయులు, వైస్ చైర్మన్లు వీరమాచనేని నాగజయరాం, పోతురాజు, టీడీపీ నాయకులు అడుసుమిల్లి రామ్మోహనరావు, బొర్రా నాగేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ ఎస్.శ్రీను, జేఈలు లక్ష్మీతులసి, కె.నిర్మల, డ్రెయినేజీ ఈఈ కిరణ్‌బాబు, ఏఈ నాగేశ్వరరావు, కుమార్, లాక్ సూపరింటెండెంట్ దావీద్ తదితరులు పాల్గొన్నారు.



సీఐలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడండి

● సీఐలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచన

గుడివాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని, విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని సీఐలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో పట్టణ, రూరల్ సీఐలు కొండపల్లి శ్రీనివాస్, సీహెచ్ నాగప్రసాద్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావుతో ఆయన సమావేశమయ్యారు. గంజాయి, బెట్టింగ్ అరికట్టడంపై చర్చించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే అరాచక శక్తులను అణిచివేయాలని, గంజాయి, క్రికెట్ బెట్టింగ్‌లకు యువత బానిస కాకుండా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికపై నిఘా ఉంచామని, గంజాయి, క్రికెట్ బెట్టింగ్‌ల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని సీఐలు శ్రీనివాస్, నాగప్రసాద్ తెలిపారు. టిడ్కో కాలనీలో అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేశామని రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. టిడ్కో, ఎన్టీఆర్ కాలనీల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

గుడివాడలో నీటి ఎద్దడి రాకుండా చూడండి

● మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశం

గుడివాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. శివారు ప్రాంతాలకూ తాగునీరు అందేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. కమిషనర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇంజినీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

● ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు

గుడివాడ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలని, గ్రామాల అభివృద్ధికి అందరం కలిసి నడుద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. చౌటపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు, కూటమి నేతలతో కలిసి ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రజావేదికలో వచ్చిన వినతులను పరిశీలించారు. గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న తాగునీటి, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, సర్పంచ్ వెలగలేటి రమ్య, ఎండీవో విష్ణు ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ సూరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిస్మత్‌రాణి, ఏవో అనంతలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.హరికృష్ణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు మార్జిన్లు అభివృద్ధి చేస్తున్నారు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



పామర్రు అగ్నిమాపక కేంద్రం బజారులో సీసీ రోడ్డు మార్జిన్లను అభివృద్ధి చేస్తున్న కార్మికులు

పామర్రు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు జరిగి నెలలు గడస్తున్నా అధికారుల పర్యవేక్షణ లోపించడంతో రోడ్లకు ఇరువైపులా మార్జిన్లు మెరక చేయకుండా కాంట్రాక్టర్లు వదిలేశారని, ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో 'రోడ్లేశారు.. మార్జిన్ల అభివృద్ధి మరిచారు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం అగ్నిమాపక కేంద్రం బజారులో నిర్మించిన నూతన సీసీరోడ్డు మార్జిన్లను గ్రావెల్‌తో అభివృద్ధి చేస్తున్నారు. మిగిలిన రోడ్ల మార్జిన్లను రెండుమూడు రోజుల్లో అభివృద్ధి చేస్తామని పంచాయతీరాజ్ ఏఈ పి.రామారావు తెలిపారు.

పరీక్ష రాసి బైక్‌పై వస్తుండగా

ఫిట్స్ వచ్చి పడిపోయాడు

● పదో తరగతి విద్యార్థిని ఆటోలో ఆస్పత్రికి తరలించిన హోంగార్డు



విద్యార్థిని ఆస్పత్రిలోకి తీసుకెళుతున్న హోంగార్డు కోటేశ్వరరావు

గుడివాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష రాసి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఫిట్స్ రావడంతో బైక్‌పై నుంచి విద్యార్థి పడిపోయిన ఘటన శుక్రవారం ఏజీకే మునిసిపల్ ఉన్నత పాఠశాల వద్ద జరిగింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు కోటేశ్వరరావు చికిత్స నిమిత్తం విద్యార్థిని హుటాహుటిన ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అరవపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి వికాస్ త్రివేణి పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాసి తండ్రితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్దకు రాగానే ఫిట్స్ వచ్చాయి. దీంతో కింద పడిపోయాడు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు కోటేశ్వరరావు స్పందించి వికాస్‌ను ఆటోలో ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వికాస్ కోలుకుని ఇంటికి వెళ్లిపోయాడు. హోంగార్డును స్థానికులు అభినందించారు. వికాస్ ఫొంగుతో బాధపడుతున్నట్టు తెలిసింది.



స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఆ దస్తావేజులు పంచాయతీ కార్యదర్శి దుర్గానాగమల్లేశ్వరరావుకు అందజేస్తున్న దాతలు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం వితరణ

గుడ్లవల్లేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వెణుతురుమిల్లి గ్రామానికి చెందిన కొల్లిపర సత్యనారాయణరావు, సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తె గ్రామ పంచాయతీకి 299 గజాల స్థలాన్ని సొంత ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసి వితరణగా ఇచ్చారు. రూ4.04 లక్షల విలువ చేసే ఈ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి గ్రామానికి ఉపయోగించాలని కోరారు. శుక్రవారం కార్యదర్శి దుర్గానాగమల్లేశ్వరరావుకు రిజిస్ట్రేషన్ పత్రాలను కొల్లిపర వెంకట కృష్ణారావు, రామ నరసింహారావు, జోగానందరావు, పార్థసారథి, నాగేశ్వరరావు, కొల్లూరి లక్ష్మీకుమారి అందజేశారు.



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

కరాటే పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని పోలీస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జేఎస్‌కేఎస్ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఆయన అభినందించారు. 14 ఏళ్లలోపు బాలుర, బాలికల వ్యక్తిగత కటా విభాగంలో బి.అఖిల్ కార్తీకేయ, బి.చాతుర్య, కె.దీపక్ కృష్ణ సాయిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, పదకొండేళ్లలోపు బాలికల వ్యక్తిగత కటా విభాగంలో ఎల్.పార్వతి ప్రథమ స్థానం, పదేళ్లలోపు బాలుర, బాలికల వ్యక్తిగత కటా విభాగంలో వై.కీర్తి వర్షిణి, కె.వేదశ్రీ నాగేంద్రకుమార్, టి.శాన్వి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులు, కోచ్ వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన



మాట్లాడుతున్న కేడీబీ ట్రస్టు కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు

పామర్రు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): డౌన్ సిండ్రోమ్ అనేది జన్యుపరమైన రుగ్మతని దాని పట్ల ప్రజలకు మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఎలకుర్రు కేడీబీ ట్రస్టు కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కేడీబీ ట్రస్టులో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా నిడుమోలు యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు కె.శ్రీనివాసరావు విచ్చేశారు. మానసిక దివ్యాంగ చిన్నారుల అభ్యున్నతి కోసం కేడీబీ అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు. ప్రిన్సిపాల్ వసుంధర, వై.ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

పశుసంపదను పరిరక్షించుకుందాం

● లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు



కపిలేశ్వరపురంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు

పమిడిముక్కల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంతరించి పోయే స్థితికి చేరుకుంటున్న పశుసంపదను పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు అన్నారు. విజయవాడ రూరల్ లయన్స్‌క్లబ్, కపిలేశ్వరపురం లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కపిలేశ్వరపురంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుపోషణను భారంగా భావించి పశుపోషకులు ఆసక్తిచూపడం లేదన్నారు. ప్రతి రైతూ ఒక పశువునైనా పోషిస్తే ఎంతో ప్రయోజనకరమని విజయవాడ్ రూరల్ క్లబ్ అధ్యక్షుడు సూర్యదేవర శ్రీవేణు సూచించారు. లాయర్ చిగులూరి కృష్ణారావు 35 ఆవులను పోషిస్తున్నారని, ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. కపిలేశ్వరపురం క్లబ్ అధ్యక్షుడు కడియాల ప్రకాశం, సెక్రటరీ తుమ్మల వెంకట గంగాధరరావు, చిగురుపాటి జగదీశ్, లింగం శివ శంకర్, శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్ పాల్గొని సేవలందించారు. పశువైద్యులు వెంకటేశ్వరరావు, రామ్‌నరేశ్, ఈశ్వర్, రవికుమార్ తదితరులు పశువులకు వైద్య పరీక్షలు చేసి గర్భకోశ వ్యాధులకు చికిత్స, టీకాలు, నట్టల నివారణ టీకాలు వేసి మందులు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు మొక్కలునాటారు.

చివరి ధాన్యపు గింజా కొనాలి

● నెలాఖారు వరకే ధాన్యం కొంటామనడం సరికాదు

● జిల్లాలో ఇంకా 30 శాతం వరి కుప్పలు నూర్చాలి

● ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలి: కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు

కూచిపూడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి చివరి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఏపీ కౌలు రైతు సంఘంజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదని, ఇది రైతులను ఆందోళనకు గురిచేస్తోందని ఆయన అన్నారు. జిల్లాలో 30 శాతం వరి కుప్పలు నూర్చాల్సి ఉందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మార్చి నెలాఖరు వరకే కొనుగోలు చేస్తామనటం వల్ల రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతారని ఆయన అన్నారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకుని, ఇచ్చిన హామీ మేరకు చివరి గింజ వరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని నారాయణరావు డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పమిడిముక్కల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్తగా అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న కారణంగా శనివారం ఉదయం 8నుంచి 10 గంటలవరకు కృష్ణాపురం, చోరగుడి, అలినకీపాలెం, పెనుమత్స, గోపాలకృష్ణపురం, ముసలి నాయకుని పాలెం, గౌడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, లంకపల్లి, నమ్మితాలగుంట, అప్పారావుపేట గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ జి.గోవిందరావు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ప్రిన్సిపాల్ కరుణకుమార్

గుడ్లవల్లేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీక్లబ్ గుడివాడ సౌజన్యంతో ఫ్యాకల్టీకి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ ప్రారంభించారు. మధుమేహం, రక్తపోటు, ఈసీజీ, హృదయ, గర్భకోశ, చర్మం, నరములు, కిడ్నీ సంబంధిత సమస్యలకు పరీక్షలు నిర్వహించారు.

కంచనపల్లి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో..

గుడివాడ: 29వ వార్డు బేతవోలులో కంచనపల్లి నాగకుమారి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యబృందం వివిధ రకాల వైద్యసేవలను అందించింది. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందన

పమిడిముక్కల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఇటీవల నిర్వహించిన సబ్‌జూనియర్ కబడ్డీ బాల బాలికల రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించిన తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం వైఎస్ఎన్ ప్రసాద్ అభినందించారు. బాలికల జట్టులో బోయి వెంకటలక్ష్మి, బాలుర జట్టులో కొల్లి వెంకట్ ఆడారని, రెండు జట్లు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించాయని ఆయన తెలిపారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను, వీరికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవీంద్రబాబు, ఏపీ రాజును హెచ్ఎం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండండి

పెదపారుపూడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ఎండవేడిమి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సందీప్ సూచించారు. శుక్రవారం వెంట్రప్రగడ పీహెచ్‌సీలో ఆయన మాట్లాడారు. వేసవి ఉష్ణోగ్రత కారణంగా శరీరానికి నిస్సత్తువ రాకుండా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, మంచినీళ్లు, ఓఆర్ఎస్ వంటివి ఎక్కువగా తీసుకుంటూ ఉండాలన్నారు. పనులు ఉదయాన్నే ముగించుకోవాలన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభిస్తున్న అతిథులు

గుడ్లవల్లేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం గుడివాడ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం అనే అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యక్తిగత, వృత్తి రంగాల్లో విజయం సాధించాలంటే విద్యార్థి దశ నుంచే దానికి పునాది పడాలని వక్తలు సూచించారు. జేసీఐ ప్రెసిడెంట్ లక్కీజైన్, సెక్రటరీ కె.మోనిష్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ చిన్న వీరస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మూడు క్వింటాళ్ల ఎండుమిర్చి చోరీ

తోట్లవల్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు శివారు అంబేద్కర్‌నగర్‌కు చెందిన రైతు చింతలపూడి వెంకటేశ్వరరావుకు చెందిన ఎండుమిర్చిని దొంగలు ఎత్తుకుపోయారు. కోతకోసి కళ్లంలో ఎండబెట్టిన మూడు క్వింటాళ్ల మిర్చిని చోరీ చేశారని వెంకటేశ్వరరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం పొలానికి వెళితే ఎండుమిర్చి లేదని, గురువారం రాత్రి దొంగలు ఎత్తుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చోరీ అయిన ఎండుమిర్చి విలువ రూ.40 వేల వరకు ఉంటుందని వెంకటేశ్వరరావు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

సైనికులుగా చేరేందుకు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

మచిలీపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భారత సైన్యంలో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2025-26 కోసం త్వరలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏప్రిల్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పరీక్ష జూన్‌లో జరుగుతుందన్నారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీని త్వరలో ప్రకటిస్తారన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా సూచించారు.



కోసూరువారిపాలెంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారులు

ఎరువుల దుకాణాలు తనిఖీ

మోపిదేవి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ శాఖ ప్రత్యేకాధికారుల బృందం శుక్రవారం తనిఖీ చేసింది. మొవ్వ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్యామల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పలు దుకాణాలను తనిఖీ చేసి అనుమతులు లేకుండా అక్రమంగా అమ్ముతున్న బయో ఎరువులు, పురుగు మందులకు స్టాప్ సేల్స్ నోటీసులు అందించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెబ్సిబా తెలిపారు. వాటికి సంబంధించిన ఇన్‌వాయిస్, లైసెన్స్‌లను వెంటనే కార్యాలయానికి అందించాల్సిందిగా సూచించటం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా అనధికారికంగా ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులను హెచ్చరించారు.



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ న్యాయాధికారి ఎస్కే ఇబ్రహీం షరీఫ్

పోక్సో చట్టంతో బాలికలకు రక్షణ

అవనిగడ్డ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బాలికలపై దాడులు, అఘాయిత్యాలు నివారించేందుకే పోక్సో చట్టం పని చేస్తుందని, ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ్ ప్రసాద్ అధ్యక్షతన జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో పోక్సో చట్టం, బాలికలపై జరుగుతున్న అకృత్యాలపై అవగాహన కల్పించారు. ఏజీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, న్యాయవాది కొండవీటి ఈశ్వరరావు, హెచ్‌ఎం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ పొందిన మహిళలతో శాస్త్రవేత్తలు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

అవనిగడ్డ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలు పెట్టుకుని స్వయం సమృద్ధిని సాధిస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. అవనిగడ్డలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి వారి సహకారంతో జరుగుతున్న విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణా కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మత్స్య, మామిడి ఉత్పత్తులకు విలువలు జోడించి అదనపు ఆదాయం పొందాలని సూచించారు. శాస్త్రవేత్తలు యశ్వంత్ కుమార్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వక్కలగడ్డలో 1,903 ఎకరాల రీ-సర్వే పూర్తి



రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్న అధికారులు

చల్లపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రీ - సర్వేకు పైలెట్ గ్రామంగా వక్కలగడ్డ ను ఎంపిక చేయగా, సర్వే బృందాలతో మొత్తం 1,903 ఎకరాల భూమి రీ సర్వే పూర్తి చేశారు. పూర్తి చేసిన సర్వేకు సంబంధించి తయారు చేసిన 9 (2) నోటీసులను రైతు లకు అందించేందుకు తహసీల్దార్ డి. వనజాక్షి ఆధ్వర్యంలో వక్కలగడ్డ జడ్పీహైస్కూల్ ఆవరణలో రైతులతో సదస్సు నిర్వహించారు. ప్రతి రైతు తమ భూమి కొత్త ఎల్‌పీఎం సర్వే నెంబరు, విస్తీర్ణం సరిచూసుకోవాలని తహసీల్దార్ సూచించారు. రైతులకు నోటీసులు అందించటంతోపాటు అభ్యంతరాలున్న రైతుల నుంచి అప్పీల్స్‌ను స్వీకరించారు. సదస్సులో ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, రీ సర్వే డీటీ నీలిమ, ఇన్‌చార్జి సర్వేయర్ సిహెచ్.వల్లి పుష్ప, వీఆర్వో ప్రతిమ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసులో నిందితులను నిగ్గు తేల్చండి

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డిమాండ్

అవనిగడ్డ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలు మాట్లాడటం మాని డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసులో నిందితులను నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ శ్రీహరిరావు తనకు అత్యంత సన్నిహితులు, వ్యాపార భాగస్వామి అని, ఆయన హత్యకు గురైన తర్వాత దోషులెవ్వరో తేల్చాలని తాను పోలీసు ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశానన్నారు. హత్య జరిగిన అనంతరం నాలుగేళ్లపాటు మాట్లాడకుండా ఉండి, ఎన్నికల సమయంలో తనకు ఆపాదిస్తూ బుద్ధప్రసాద్ రాజకీయం చేయటం దురదృష్టమన్నారు. ప్రభుత్వం సీబీసీఐడీ విచారణను వెంటనే ప్రారంభించి నిందితులెవ్వరో తేల్చాలన్నారు. దర్యాప్తును పక్కదోవ పట్టించేలా బుద్ధప్రసాద్ వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. ఎథిక్స్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను నియమించటాన్ని రమేష్‌బాబు తప్పుబట్టారు. బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులు సాగిస్తున్న దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే శ్రీహరిరావు హత్యను రాజకీయంగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నేతలు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జైగోపాల్, తోట గణేష్, షేక్ నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.





వలందపాలెం మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి రవీంద్ర



చిట్టి పిల్లారయ్యస్వామి ఆలయంలో హోమపూజల్లో మంత్రి రవీంద్ర

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వలందపాలెం జామియా మసీదులో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ముస్లింలతో కలసి ప్రార్థనలు జరిపారు.

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రంజాన్ మాసం త్యాగం, సహనానికి ప్రతీక అన్నారు. ముస్లింల ప్రార్థనలు సర్వమానవాళికి రక్షణ కలిగిస్తాయన్నారు. ముస్లిం మత పెద్దల విన్నపం మేరకు మచిలీపట్నంలోని జామియా మసీదు అభివృద్ధితో పాటు వారు వ్యాపారం చేసుకునేందుకు షాపుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా స్థాయిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని, ముస్లిందరూ రావాలని ఆహ్వానించారు.

ఇమామ్ మహ్మద్ ఇక్రముల్లా, మూడో డివిజన్ ఇన్‌చార్జి మహమ్మద్ సిద్దిక్, పార్టీ ఇన్‌చార్జి చిన్నం సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మత పెద్దలు పాల్గొన్నారు.

హోమపూజల్లో మంత్రి రవీంద్ర

బుట్టాయిపేటలోని చిట్టిపిల్లారయ్య స్వామి దేవాలయంలో దశమ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం హోమ పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



బాబావలి ఉరుసు ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

కోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పెదగుడుమోటులోని బెంగాలీ షా బాబావలి ఉరుసు మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా బెంగాలీషా బాబావలి దర్గా వద్ద ప్రతీ ఏటా ఉరుసు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఉదయం ఉరుసు ప్రారంభమవతుంది. బాబా సమాధికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రికి అశ్వంపై చందనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలకతీతంగా అందరూ పాల్గొనాలని కమిటీ కోరింది.

ప్రతి రైతు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయశాఖాధికారి మనోహరరావు



మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మనోహరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 80 శాతం నమోదు చేసుకున్నారని, శనివారం తుది గడువుగా ప్రభుత్వం పేర్కొన్నారు. ఈకేవైసీపై రైతులు దృష్టి సారించాలన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

అవనిగడ్డ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శనివారం ఉదయం 12 గంటల నుంచి 1 గంట వరకు జరుగుతుందని డిపో మేనేజర్ కె.హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలు సెల్ నెం.9959225466కు అందించాలని ఆయన కోరారు.

దివిసీమలో ఆపరేషన్ గరుడ

● మెడికల్ షాపుల్లో ఈగల్ బృందం తనిఖీలు

అవనిగడ్డ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల కట్టడిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ గరుడ కార్యక్రమంలో భాగంగా అవనిగడ్డలో శుక్రవారం ఈగల్ బృందం నిర్వహించిన తనిఖీలు దివి ప్రాంతంలో కలకలం సృష్టించాయి. విజిలెన్స్ ఐజీ రవికృష్ణ నేతృత్వంలో అవనిగడ్డలోని పలు మందుల దుకాణాలపై ఈగల్ బృందం ఏకకాలంలో దాడులు నిర్వహించి దుకాణాల్లోని మందులను, స్టాక్ రిజిష్టర్లు తనిఖీ చేశారు. నిషేధిత మందులు, ఎన్‌ఆర్‌ఎక్స్ మందులు విక్రయాలను తనిఖీ చేశారు. గంజాయి, మత్తు మందుల లభ్యత లేకపోవటంతో వాటికి అలవాటు పడిన వారు ప్రత్యామ్నాయంగా మందుల దుకాణాల్లో తేలికగా దొరికే మత్తుమందులు వినియోగిస్తున్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక వెళ్లటంతో రాష్ట్ర వ్యాప్తంగా 100 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయని ఐజీ రవికృష్ణ తెలిపారు. అవనిగడ్డలోని ఓ మందుల దుకాణంలో 50 వేల విలువైన ట్రిమడాల్, ఆల్ప్రాజోలోమ్ మందులను అధికారులు సీజ్ చేశారు. వైద్యుని సిఫార్సు లేకుండా మందులు అమ్మటానికి వీల్లేదన్నారు. అలాంటి మందులు వినియోగించినా, అమ్మినా ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు తీసుకుంటామని రవికృష్ణ తెలిపారు. వీటితోపాటు నిద్ర వచ్చేందుకు వినియోగించే దగ్గు మందులు ఎక్కువగా స్టాక్ చేసిన వారిని గుర్తించి ఏ వైద్యులు సిఫార్సు చేశారో తెలపాలని అధికారులు మందుల షాపుల యజమానులను కోరారు. ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించామని, అలాంటి షాపులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజ్ చేసిన మందులను అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీకి అప్పగించి ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్పీ నగేష్ బాబు, పోలీస్ శాఖ సోషల్ మీడియా సీఐ నున్న రాజు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ ఎం.బి.ఆర్.ప్రసాద్, ఏడీ అనిల్ కుమార్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మందులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఐజీ రవికృష్ణ

ఆందోళనలో వ్యాపారులు

ఆపరేషన్ గరుడలో భాగంగా శుక్రవారం ఈగల్ బృందం దాడులు వ్యాపారుల్లో ఆందోళన రేకెత్తించాయి. మధ్యాహ్నం 12 గంటలకే అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లోని పలు మందుల షాపులను నిర్వాహకులు మూసివేసి వెళ్లిపోయారు. నిషేధిత మందులను స్టాక్ పెట్టినట్లు ఫిర్యాదులు ఉన్న షాపులకు వెళ్లిన అధికారులు తనిఖీలు కొనసాగించారు. సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గ కేంద్రం అవనిగడ్డతోపాటు నాగాయలంక, కోడూరు మండలాల్లోని మందుల షాపులు మూసి ఉంచటంతో నియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వచ్చింది.



సీఐఎస్ఎఫ్ బలగాలకు స్వాగతం పలుకుతున్న చల్లపల్లి సీఐ, మోపిదేవి ఎస్సై, విద్యార్థులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో సీఐఎస్ఎఫ్

మోపిదేవి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సీఐఎస్ఎఫ్ బృందం శుక్రవారం దర్శించుకున్నారు. సీఐఎస్ఎఫ్ 56 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కలకత్తా నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. ర్యాలీకి మోపిదేవి శివారులో చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, విద్యార్థులు స్వాగతం పలికారు. సీఐఎస్ఎఫ్ సభ్యులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు వారికి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. మార్చి 7వ తేదీన ప్రారంభమైన ర్యాలీ దేశ వ్యాప్తంగా 6500 కిలోమీటర్లు కొనసాగుతుందని కేంద్ర బలగాలు తెలిపాయి.



కానూరులో ప్రజలకు డస్ట్‌బిన్‌లు అందజేస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తడి, పొడిచెత్త వేర్వేరుగా ఇవ్వాలని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరు గ్రామంలో శుక్రవారం ప్రజలకు తడి, పొడిచెత్త వేర్వేరుగా ఇవ్వడంపై అవగాహన కల్పించారు. తడి, పొడిచెత్త వేర్వేరుగా ఇచ్చేందుకు ఇంటింటికీ డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించాలన్నారు. జనసేన నాయకులు దివి మహేష్, చక్కా ఏడుకొండలు, పీతా రాము, మోకా వెంకన్న, మోపిదేవి కృష్ణ, ఇమానుయేల్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి బొండాల వ్యర్థాలు బయట పడేయొద్దు



కొబ్బరి బొండాల విక్రయదారులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు

ఘంటసాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు వ్యర్థాలను బయట పడవేయవద్దని, ఇంటింటికి ఉదయాన్నే వస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను అందించాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కొడాలిలో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కొత్తపల్లి గ్రామంలో కొబ్బరి బొండాలు విక్రయించే వారితో మాట్లాడి వ్యర్థాలు రహదారి పక్కన వేయవద్దని తెలిపారు. గొర్రెల కాపరులు వ్యర్థాలను సంపద సృష్టి కేంద్రానికి తరలించేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సిహెచ్‌వి.ఎస్.నాగమణి, సునంద తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ డి.సుధారాణి

వర్మీకంపోస్టు ఎంతో ఉపయోగకరం

ఘంటసాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కృషి విజ్ఞాన కేంద్రంలో వానపాముల తయారీ, ఉపయోగంపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ రైతులకు వర్మీకంపోస్టు ఎరువు అత్యంత ఉపయోగకరమన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ సహజ వాతావరణంలో ఒకప్పుడు నేలలో విరివిగా కనిపించే వానపాములు నేడు కనుమరుగైపోయాయని తెలిపారు. నాణ్యమైన పంట, మొక్కలు చీడపీడలను తట్టుకునే శక్తి, నేల ఆరోగ్యంగా ఉండాలంటే వర్మీ కంపోస్టు ఎరువు అత్యంత ఉపయోగకరమని వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ బి.నవీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దిరిశంవాని దళితవాడలో ఈవోపీఆర్డీ పర్యటన

ఘంటసాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల దిరిశంవాని దళితవాడలో నీటి సమస్యపై గ్రామానికి చెందిన కొల్లూరి సుధాకర్ మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీ అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో సుబ్బారావు శుక్రవారం దిరిశంవాని దళితవాడలో పర్యటించారు. ఫిర్యాదుదారుడు సుధాకర్, గ్రామస్థులతో మాట్లాడిన ఎంపీడీవో సుబ్బారావు నీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మికి సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

గూడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, గూడూరు మండల పరిషత్ అధ్యక్షుడు సంగా మధుసూదనరావు పలు అంశాలపై చర్చించి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి, సర్పంచ్ బొర్రా సాంబయ్య, డాక్టర్ తరుణ్‌శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలందపాలెంలో చలివేంద్రం ప్రారంభం

మచిలీపట్నం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వలందపాలెం రంగాబొమ్మ సెంటర్‌లో జనసేన డివిజన్ ఇన్‌చార్జి ఊచా చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ప్రారంభించారు. గడ్డం రాజు, వంపుగడల చౌదరి, వడ్డి చిరంజీవి, గంటా సురేష్, పొన్నూరు శేఖర్, ఉడుముల బుజ్జి, తోట రాజేష్, బండి కరుణాకర్, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

మినుపతీత పనులు వేగవంతం

కోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మినుప కాయతీతపనులు వేగవంతంగా సాగుతున్నాయి. కూలీలు కొరత ఉండటంతో రైతులు యంత్రాల సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. లింగారెడ్డిపాలెం, మందపాకల, పోటుమీద, పిట్టల్లంక ప్రాంతాల్లో ప్రస్తుతం కాయతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎకరానికి 5 నుంచి 9 బస్తాల దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.